



వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక

## యూరియా యాప్‌పై ఆందోళన వద్దు




03

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 20 | 31-05-2026 ఆదివారం | పేజీలు: 04 | వెల: 3/-

# ఉచిత్ విద్యుత్ ఆపేస్తే ఓట్లు అడగబోము

స్మార్ట్ మీటర్లు పెట్టినా ఓట్లు అడగము
బీఆర్ఎస్ పార్టీకి రేవంత్‌రెడ్డి సంచలన సవాల్
బీఆర్ఎస్‌కు ఉచిత విద్యుత్‌పై ఓపెన్ ఛాలెంజ్
రైతు డిస్కంతో పారదర్శకత సాధిస్తామని స్పష్టీకరణ
కేంద్ర, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేసిన సీఎం
అప్పులపై ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టిన రేవంత్
హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు
బీజేపీ–బీఆర్ఎస్ పొత్తుపై అనుమానాలు
ధాన్యం కొనుగోళ్లపై కేంద్రాన్ని టార్గెట్ చేసిన సీఎం
జల వివాదాలపై మహారాష్ట్రపై అసంతృప్తి
2034 వరకు రాజకీయాల్లోనే కొనసాగుతానని ప్రకటన



**హైదరాబాద్, (డిడి9 వార్త):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులకు ఉచిత విద్యుత్ అంశంపై బీఆర్ఎస్‌కు ఆయన ఓపెన్ సవాల్ విసిరారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే లేదా రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను నిలిపివేస్తే తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని స్పష్టం చేశారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా? అని ప్రశ్నిస్తూ రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీశారు. రైతుల సంక్షేమం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రైతుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకుంటూ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమాలను వాడుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యంగా రైతు డిస్కం (డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఉచిత విద్యుత్ వినియోగాన్ని ఈ కొత్త వ్యవస్థకు ..మిగతా 2లో



# 111 జీవోను ఎత్తివేస్తాం

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పక్కా
ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయి
హక్కుల పరిరక్షణ కోసమే కొత్త పార్టీ
రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదు
కల్వకుంట్ల కవిత ఆగ్రహం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తమ పార్టీ అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ జీవో కారణంగా బాధపడుతున్న వారందరికీ ఉపశమనం కలిగిస్తామన్నారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్‌లో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏ లక్ష్యాల కోసం తెలంగాణ సాధించుకున్నామో అవి గత 12 ఏళ్లలో సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను పరిరక్షించుకునేందుకే టీఆర్ఎస్ ఏర్పాటు చేశామన్నారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇక్కడి ప్రజలకు 111 జీవో ఎత్తేస్తామంటూ మాట ..మిగతా 2లో

## రైతులను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
దళారీలు, అధికారుల మధ్య రైతులు నలిగిపోతున్నారు
బీజేపీ బస్సు యాత్రతోనే ప్రభుత్వంలో కదలిక
ధాన్యం కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతే
కేంద్రం కొనడం లేదనడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే
ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై కేంద్ర-రాష్ట్ర ఒప్పందం
కమీషన్లు, రియల్ ఎస్టేట్‌పైనే ప్రభుత్వ దృష్టి
రైతుల కష్టాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక లోపించింది
రైతు వ్యతిరేక విధానాలను బీజేపీ ప్రశ్నిస్తూనే ఉంటుంది



**హైదరాబాద్, (డిడి9 వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ..మిగతా 2లో

## విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు

రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా 30 డీఈవో పోస్టులు
రాజకీయ కక్షతో మన ఊరు మన బడి నిలిపివేత
పెండింగ్ బిల్లులు, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు ఏది?
ప్రభుత్వంపై హరీశ్ రావు ధ్వజం



**హైదరాబాద్, (డిడి9 వార్త):** రాష్ట్రవ్యాప్తంగా 30 డీఈవో పోస్టులు ఖాళీగా పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. రాజకీయ కక్షతో ..మిగతా 2లో

## శత్రువుకు ఆపరేషన్ సిందూర్ దీటైన సమాధానం

ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు
ఎన్‌డీఏ పరేడ్‌లో రక్షణ వ్యూహాల వెల్లడి
జాతీయ సంకల్పానికి నిలువెత్తు నిదర్శనంగా 'ఆపరేషన్ సిందూర్'
శత్రు దేశాల దుశ్చర్యలకు తిరుగులేని ప్రతిస్పందన
ఆపరేషన్ సిందూర్ రెండో విడతకు సైతం త్రివిధ దళాలు సన్నద్ధం
యుద్ధాలు సరిహద్దులకే పరిమితం
కాకుండా అంతరిక్షం, సైబర్ రంగాల్లో అవకాశం
ప్రతి జవాన్‌కు డ్రోన్లు నడపడంలో
నైపుణ్యం తప్పనిసరి అన్న సైన్యాధిపతి
త్వరితగతిన సైనిక నిర్ణయాలు
తీసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
ఖడక్ వాస్లా ఎన్‌డీఏ 150వ కోర్సు
పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ద్వివేది
18 మంది మహిళలతో సహా విజయవంతంగా
శిక్షణ పూర్తి చేసుకున్న 353 మంది క్యాడెట్లు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సరిహద్దులను టార్గెట్ చేస్తూ శత్రు దేశాలు చేసే ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకైనా మన దేశం ఇచ్చే ప్రతిస్పందన ఎలా ఉంటుందో చెప్పడానికి 'ఆపరేషన్ సిందూర్' ఒక అత్యుత్తమ ప్రమాణాన్ని నెలకొల్పిందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అత్యంత స్పష్టంగా ప్రకటించారు. జాతీయ సంకల్పాన్ని అత్యంత కచ్చితత్వంతో, దృఢ నిశ్చయంతో శత్రువులకు అర్థమయ్యేలా ఎలా వ్యక్తపరచవచ్చో ఈ ఆపరేషన్ దేశ రక్షణ చరిత్రలో నిరూపించిందన్నారు. మహారాష్ట్రలోని పుణె ..మిగతా 2లో

## బాల్క సుమన్ అరెస్ట్..

వివాదాస్పద వ్యాఖ్యల కేసులో మాజీ ఎమ్మెల్యే అదుపులోకి
తెలంగాణ భవన్‌కు చేరుకున్న నాంపల్లి పోలీసులు
పోలీసుల రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన
'గో బ్యాక్' నినాదాలతో కార్యకర్తల నిరసన
నాన్ బెయిలబుల్ కేసు నమోదైందన్న పోలీసులు
మీడియాతో మాట్లాడిన తర్వాత అరెస్టు
ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన బాల్క సుమన్
సింగరేణిలో భారీ కుంభకోణాలు జరుగుతున్నాయని ఆరోపణ
కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని విమర్శ
ప్రశ్నించే నేతలను వేధించడం ప్రభుత్వానికి అలవాటైందని వ్యాఖ్య



**హైదరాబాద్, (డిడి9 వార్త):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో ఆయనపై నమోదైన నాన్ బెయిలబుల్ కేసు నేపథ్యంలో పోలీసులు తెలంగాణ భవన్‌కు చేరుకుని ..మిగతా 2లో

# 111 జీవోను ఎత్తివేస్తాం

మొదటిపేజీ తరువాయి

ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాయని విమర్శించారు. తాము అలా చేయమన్నారు. జీవో పరిధిలో ఉన్న 120 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుట్టు పక్కల భూములు ఎకరాకు వంద కోట్లకు పైగా ధర పలుకుతుంటే 111 జీవో పరిధిలోని ప్రజలు మాత్రం తమ భూములను ఎక్కువ రేటుకు అమ్ముకోలేని పరిస్థితి ఉన్నదన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం భూమి అమ్మితే సమస్యలు తీరుతాయని భావించినా జీవో అడ్డంకిగా ఉన్నదన్నారు. ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే తెలుసని ఎద్దేవా చేశారు. చేవెళ్ల, మొయినాబాద్‌లో ఎక్కువగా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారని వారికి మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని మండిపడ్డారు.

**హక్కుల పరిరక్షణకే కొత్త పార్టీ**

తెలంగాణ వచ్చాక అన్ని సమస్యలు తీరుతాయని భావిస్తే అలా జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యాల కోసం రాష్ట్రం సాధించుకున్నామో ఆ లక్ష్యాలతో పాటు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని వ్యాఖ్యానించారు. ''ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా మీకు ఏం కావాలో నాకు తెలుసు. తప్పకుండా మన పార్టీ ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నా'' అని అన్నారు. అదే విధంగా యువత కోసం ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. సృజనాత్మక ఆలోచన కలిగిన యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ నుంచి మైనార్టీలు పెద్ద ఎత్తున చేరటంతో ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడిందని చెప్పారు. ఇక్కడి గంగా జమున తెహజీబ్‌ను చెడగొట్టే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరమున్నదని కవిత అన్నారు.

**చిలుకూరు బాలాజీ దర్శనం**

మరోవైపు, చిలుకూరు బాలాజీ స్వామివారిని కవిత దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన తమ పార్టీకి స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చామని చెప్పారు. బాలాజీ ఆశీస్సులతో తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతులకు మంచి చేసే బుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాలని స్వామి వారిని కోరుకున్నానని చెప్పారు. జెండా పండుగ కార్యక్రమం అనంతరం మొయినాబాద్ మండలం సొరంగల్‌లో టీఆర్ఎస్ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేశారు.




# ఉచిత్ విద్యుత్ ఆపేస్తే ఓట్లు అడగబోము

మొదటిపేజీ తరువాయి

అనుసంధానం చేయడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వస్తున్న విమర్శలను కూడా రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది సుమారు రూ.70 వేల కోట్ల మేర అప్పులు తీసుకుంటున్నప్పటికీ, గత ప్రభుత్వాల హయాంలో చేసిన సుమారు రూ.95 వేల కోట్ల అప్పులను కూడా తాము చెల్లిస్తున్నామని వివరించారు. అప్పుల నిర్వహణపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

హరీశ్‌రావుపై కూడా ముఖ్యమంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై ఒట్టేసి తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని హరీశ్‌రావు చెప్పాలని సవాల్ విసిరారు. గతంలో ఆయన రాజకీయంగా ఇతర నాయకులతో సంప్రదింపులు జరిపిన విషయాలను ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి, ఇటీవల పార్టీ సమావేశాన్ని వదిలి ఢిల్లీకి వెళ్లిన కారణాలను కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసని, అయితే ఆ వివరాలను ఇప్పుడే బయటపెట్టబోనని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ-బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందనే అనుమానాలను కూడా ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ రెండు పార్టీలు ఒకే వేదికపైకి వచ్చే అవకాశం ఉందని ఆరోపించారు.

సీబీఎస్ఈ పరీక్షల జవాబు పత్రాల వ్యవహారంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. గ్లోబరీనా సంస్థపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఆ సంస్థకు బీఆర్ఎస్ నాయకత్వంలోని కేటీఆర్‌తో సంబంధాలున్నాయని విమర్శించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై కూడా రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో పండుతున్న ధాన్యంలో కేవలం 32 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. రైతుల పంటలను పూర్తిగా కొనుగోలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం కొనసాగితే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

అంతర్రాష్ట్ర జల వివాదాలపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నప్పటికీ, ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పురోగతికి చర్చలు అవసరమని, కానీ అవి జరగకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. తాను 2034 వరకు తెలంగాణ రాజకీయాల్లోనే కొనసాగుతానని ప్రకటించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో తనకు మంచి సమన్వయం ఉందని, ఇద్దరి కాంబినేషన్ విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ నాయకులకు మంచి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను కులం లేదా ప్రాంతంతో ముడిపెట్టడం



సరైనది కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వాన్ని రాజకీయ కోణంలో కాకుండా, ఆయన సేవల దృష్టితో చూడాలని సూచించారు. మొత్తంగా రైతులకు ఉచిత విద్యుత్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, ప్రతిపక్షాలపై విమర్శలు, జల వివాదాలు వంటి అనేక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు విసిరిన సవాల్ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

మన ఊరు మన బడి కార్యక్రమాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి బడుల అభివృద్ధిని కుంటుపరిచారన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉపాధ్యాయులను తీవ్ర ఆర్థిక క్షోభకు గురిచేస్తున్నారని చెప్పారు. సిద్దిపేట రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో 33 జిల్లాలు ఉంటే కేవలం ముగ్గురే రెగ్యులర్ డీఈఓలు ఉన్నారన్నారు. అదనపు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, ఐఏఎస్ అధికారులకు డీఈఓ బాధ్యతలు అప్పగించడం వల్ల వారు విద్యపై పూర్తిస్థాయిలో దృష్టిసారించలేకపోతున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం రెగ్యులర్ డీఈఓలను నియమించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# బాల్క సుమన్ అరెస్ట్..

మొదటిపేజీ తరువాయి

అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో తెలంగాణ భవన్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ ఉన్నారన్న సమాచారంతో నాంపల్లి పోలీసు బృందం అక్కడికి చేరుకుంది. పోలీసులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు వెనక్కి వెళ్లాలంటూ కార్యకర్తలు 'గో బ్యాక్' నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తెలంగాణ భవన్ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన న్యాయవాదులు పోలీసు అధికారులతో చర్చలు జరిపారు. బాల్క సుమన్‌పై నమోదైన కేసు స్వరూపం, అరెస్టు ప్రక్రియ, నోటీసుల జారీ అంశాలపై ఇరువర్గాల మధ్య చర్చ జరిగింది. అనంతరం అబిడ్స్ ఏసీపీ స్పందిస్తూ బాల్క సుమన్‌పై నమోదైన కేసు నాన్ బెయిలబుల్ కేటగిరీలోకి వస్తుందని తెలిపారు. అలాంటి కేసుల్లో ముందస్తు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు.

కొంతసేపటి తర్వాత బాల్క సుమన్ తెలంగాణ భవన్ నుంచి బయటకు వచ్చారు. మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అనంతరం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని తరలించారు. అరెస్టు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

అరెస్టుకు ముందు మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం రోజుల నుంచే తనను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమ సమయంలో తనపై 250కి పైగా కేసులు పెట్టారని, అనేకసార్లు అరెస్టు చేసి జైలుకు పంపించారని గుర్తు చేశారు. రాజకీయంగా తనను అణచివేయాలనే ప్రయత్నాలు అప్పటి నుంచే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన క్యాతనపల్లి ఎన్నికల సమయంలో కూడా తనను జైలుకు పంపించారని బాల్క సుమన్ ఆరోపించారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపలేదని చెప్పారు. ప్రజల తరఫున ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే తనపై మరోసారి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి తనను జైలుకు పంపించాలని నిర్ణయించుకున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తనపై కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. తనను జైలులో పెట్టి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విమర్శించారు.

ప్రభుత్వం తనపై దృష్టి పెట్టడం కంటే ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ముఖ్యంగా సింగరేణి సంస్థలో వందల కోట్ల రూపాయల విలువైన కుంభకోణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి వ్యవస్థ మొత్తం అవినీతి ఆరోపణలతో కుదేలవుతోందని పేర్కొన్నారు. అలాంటి అంశాలపై ప్రభుత్వం స్పందించకుండా ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడం సరైన విధానం కాదని విమర్శించారు. కాంగ్రెస్ పాలన దేశంలో ఎమర్జెన్సీ కాలాన్ని గుర్తు చేస్తోందని బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు గళమెత్తే హక్కు ఉంటుందని, కానీ ప్రస్తుతం ప్రశ్నించే నాయకులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చట్టపరమైన వ్యవస్థలపై, రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

తాను ఎక్కడికీ పారిపోలేదని, పార్టీ కార్యక్రమంలో భాగంగానే తెలంగాణ భవన్‌లో ఉన్నానని బాల్క సుమన్ స్పష్టం చేశారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని పేర్కొన్నారు. తన అరెస్టును రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేయడం లేదని, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రస్తావించినప్పుడల్లా కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం ద్వారా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే అలాంటి చర్యలకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. మరోవైపు బాల్క సుమన్ అరెస్టు నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ కక్షసాధింపు చర్య అని ఆరోపించారు. ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న నాయకుల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బాల్క సుమన్‌పై నమోదైన కేసు, అరెస్టు చుట్టూ రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఈ వ్యవహారం న్యాయపరంగా, రాజకీయపరంగా ఎలాంటి మలుపులు తిరుగుతుందన్నది

# శత్రువుకు 'ఆపరేషన్ సిందూర్' దీటైన సమాధానం

మొదటిపేజీ తరువాయి

సమీపంలో ఉన్న ఖడక్‌వాస్లా జాతీయ రక్షణ అకాడమీ లో ఘనంగా జరిగిన 150వ కోర్సు ప్రతిష్టాత్మక పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా, సమీక్షా అధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయుధ దళాల శౌర్యాన్ని అభినందిస్తూ దేశ రక్షణ వ్యూహాలపై ఆయన చారిత్రాత్మక వ్యాఖ్యలు చేశారు.

ప్రస్తుతం సరిహద్దుల్లో వ్యూహాత్మకంగా ఘర్షణలు తాత్కాలికంగా ఆగిపోయినప్పటికీ.. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసిపోలేదని, అది నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. ఒకవేళ భవిష్యత్తులో శత్రువుల దుశ్చర్యల వల్ల 'ఆపరేషన్ సిందూర్ 2.0' చేపట్టాల్సి వస్తే, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దేశానికి చెందిన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ (త్రివిధ దళాలు) వంద శాతం పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం తాము మూడు దళాల మధ్య పరస్పర సమన్వయాన్ని మరింత పటిష్టం చేసుకోవడంపై, అలాగే రాబోయే కాలంలో రాగల సరికొత్త యుద్ధాలకు సైన్యాన్ని ఆధునికీకరించడంపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు వెల్లడించారు. నేటి డిజిటల్ యుగంలో యుద్ధభూమి 24 గంటలూ ఎంతో పారదర్శకంగా ఉంటుందని, మన ప్రతి చిన్న కదలిక అవతలి వారికి తెలిసిపోయే ప్రమాదం ఉన్నందున.. సైనిక మోహరింపు, వ్యూహాత్మక వినియోగం, సరిహద్దు ప్రాంతాలలోని సైనికులు మరియు పౌరుల రక్షణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేటి ఆధునిక కాలంలో యుద్ధాలు అనేవి కేవలం సాంప్రదాయ పద్ధతిలో సరిహద్దుల నుండి మాత్రమే రావని ఆర్మీ చీఫ్ అభిప్రాయపడ్డారు. దేశ సంకల్పాన్ని చాటడంలో, అలాగే క్రమబద్ధమైన, అత్యంత కచ్చితమైన ప్రతిస్పందనను శత్రువుకు అందించడంలో మన దళాల సామర్థ్యం అసాధారణమైనదన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా సమీకృత ప్రణాళికల రచన, రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ (అప్పటికప్పుడు సమాచారం సేకరించడం), కచ్చితమైన లక్ష్య నిర్దేశం, పటిష్టమైన వ్యూహాత్మక రక్షణ, అత్యంత సురక్షితమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ మరియు రక్షణ రంగానికి చెందిన వివిధ విభాగాల మధ్య పరస్పర సమన్వయం ఎంత ప్రాముఖ్యమైనవో అందరికీ స్పష్టంగా అర్థమైందని ఆయన విశ్లేషించారు.

భవిష్యత్తులో రాబోయే రక్షణ రంగ సంఘర్షణలు కేవలం నేల మీదే కాకుండా సరికొత్త రంగాలకు విస్తరిస్తాయని జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. రాబోయే రోజుల్లో భూమి, గాలి, సముద్రంతో పాటు అంతరిక్షం (స్పేస్), సైబర్ నెట్‌వర్క్, మరియు విద్యుదయస్కాంత (ఎలక్ట్రో మాగ్నెటిక్) రంగాలలో కూడా దేశాల మధ్య తీవ్రమైన యుద్ధాలు జరుగుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఈ సాంకేతిక మార్పుల పట్ల భారత సైన్యానికి పూర్తి అవగాహన మరియు ముందస్తు ప్రణాళికలు ఉన్నాయని స్పష్టం చేశారు. 'పరివర్తన దశాబ్దం' (డికేడ్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మేషన్) లో భాగంగా భారత సైన్యం భవిష్యత్ సవాళ్లను తట్టుకునే ఒక శక్తివంతమైన డిజిటల్ ఆర్మీగా రూపాంతరం చెందుతోందని, ఇందులో యువతరం పాత్ర అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు.

ఆధునిక యుద్ధ రంగంలో సాంకేతికత ప్రాధాన్యతను వివరిస్తూ.. ప్రస్తుత కాలంలో ప్రతి జవాన్‌కు డ్రోన్ నడపడం, దాన్ని ఆపరేట్ చేయడం కచ్చితంగా తెలిసి ఉండాలని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు. అందుకోసమే దేశంలోని అన్ని సైనిక అకాడమీలలో, ట్రైనింగ్ సెంటర్లలో క్యాడెట్లకు డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తాను గతంలో ఎన్‌డీఏని సందర్శించినప్పుడు ఆర్మీ శిక్షణా బృందానికి వ్యక్తిగతంగా 4 నుండి 6 పెద్ద సైజ్ డ్రోన్‌లను, అధునాతన సిమ్యులేటర్‌లను స్వయంగా అందించానని గుర్తు చేసుకున్నారు. ఎందుకంటే యువ క్యాడెట్లు ఇక్కడి నుంచి నేరుగా యుద్ధభూమికి వెళ్లినప్పుడు అక్కడ వందలాది డ్రోన్‌లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈ నైపుణ్యాన్ని ఇక్కడే నేర్చుకోకపోతే క్షేత్రస్థాయిలో వాటిని అర్థం చేసుకోవడం మరియు శత్రువుల వ్యూహాలను తిప్పికొట్టడం వారికి చాలా కష్టమవుతుందని వివరించారు.

సైనిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎందుకు అంత కీలక పాత్ర పోషిస్తుందో కూడా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శాస్త్రీయంగా వివరించారు. సరిహద్దుల్లో మన నియంత్రణకు మించి అపారమైన వనరులు, డేటా ఉన్నప్పుడు వాటన్నింటినీ మనుషులు ఒకేసారి సొంతంగా నిర్వహించడం అసాధ్యమన్నారు. రక్షణ రంగంలో నిరంతరం పరిశీలించడం, దిశానిర్దేశం చేయడం ), నిర్ణయించడం , మరియు తక్షణ చర్య తీసుకోవడం అనే 'ఓడీఏ'సైకిల్ అత్యంత కీలకమన్నారు. సరిహద్దుల్లో ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ ఘర్షణ వాతావరణాలు లేదా సైకిల్స్ పనిచేస్తున్నప్పుడు వేగంగా స్పందించడం సాధారణ మానవ మేధస్సుకు సవాల్‌గా మారుతుందన్నారు.

యుద్ధ వేగం ఊహించని రీతిలో చాలా ఎక్కువగా ఉన్నప్పుడు, ఎంతో తక్కువ సమయంలో అత్యంత సరైన నిర్ణయాలు తీసుకోవడానికి మనకు సాంకేతిక మద్దతు అవసరమవుతుందని ఆర్మీ చీఫ్ తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భంలో మనకు లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ , ఎస్ఎల్ఎం వంటి సరికొత్త ఏఐ సాంకేతికతలు ఎంతో సహాయపడతాయన్నారు. వనరుల హేతుబద్ధీకరణ, వాటి సరైన వినియోగం వంటివి నేటి డిజిటల్ ప్రపంచంలో క్షణాల వ్యవధిలో జరిగిపోతున్నాయన్నారు. ఆధునిక యుద్ధాలలో శత్రువులు అనేక రకాల డ్రోన్లను వాడుతున్నారని, అందుకే వాటిని సమర్థవంతంగా కూల్చివేసేందుకు 'యాంటీ డ్రోన్' పరికరాలు మరియు ఆటోమేషన్ రక్షణ వ్యవస్థలు మనకు ఎంతో అవసరమన్నారు. అపారమైన వనరులను పర్యవేక్షించడానికి ఆటోమేషన్ రక్షణ వ్యవస్థ చాలా కీలక పాత్ర పోషిస్తుందని ద్వివేది అభిప్రాయపడ్డారు. దేశంలోనే అత్యున్నతమైన నేషనల్ డిఫెన్స్ అకాడమీ 150వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌కు సమీక్షా అధికారిగా రావడం తనకు దక్కిన అరుదైన గౌరవమని, ఇది తన గుండెల్లో ప్రగాఢమైన వ్యక్తిగత భావోద్వేగాన్ని కలిగిస్తోందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆనందం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక బ్యాచ్‌లో 18 మంది సాహసవంతులైన మహిళా క్యాడెట్లతో సహా మొత్తం 353 మంది క్యాడెట్లు ఈ గొప్ప సంస్థ నుండి విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇది అకాడమీకి, సాయుధ దళాలకు మరియు దేశం మొత్తానికి ఎంతో గర్వకారణమైన క్షణమన్నారు. "మీరంతా దేశ రక్షణ కోసం ప్రతిష్టాత్మకమైన ఆర్మీ యూనిఫాం ధరించడానికి ఉత్సాహంగా సిద్ధమవుతుండగా.. నేను నా సుదీర్ఘ సేవలను ముగించుకుని నా యూనిఫాం తీసివేయడానికి సిద్ధమవుతున్నాను" అని ఆయన భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఎన్‌డీఏలో నేర్చుకున్న క్రమశిక్షణ, దేశభక్తి విలువలు మీ జీవితంలో శాశ్వతంగా నిలిచిపోతాయని క్యాడెట్లకు భరోసా ఇచ్చారు. ఈ కోర్సులో విజయవంతంగా ఉత్తీర్ణులైన 12 మిత్ర విదేశాలకు చెందిన 24 మంది అంతర్జాతీయ క్యాడెట్లకు కూడా ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# రైతులను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు.

దళారీలు, అధికారులు, ప్రభుత్వ వ్యవస్థ మధ్య రైతులు నలిగిపోతున్నారని కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టపడి పండించిన పంటకు సరైన ధర, సరైన సమయంలో కొనుగోలు సౌకర్యం కల్పించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించిందని విమర్శించారు.

బీజేపీ చేపట్టిన రైతు బస్సు యాత్రతోనే రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక వచ్చిందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లిన తర్వాతే ప్రభుత్వం స్పందించడం ప్రారంభించిందన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం ముందుగానే స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ధాన్యం సేకరణ, కొనుగోలు ప్రక్రియ నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కేంద్రం నిర్దేశించిన విధానాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టి, ఆ ధాన్యాన్ని కేంద్రానికి అప్పగించే వ్యవస్థ అమల్లో ఉందని వివరించారు.

ఖరీఫ్ సీజన్‌లో 58.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఇప్పటికే ఒప్పందం కుదిరిందని కిషన్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కంటే కమీషన్లు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని ఆయన ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. పంట సీజన్ ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రవాణా సదుపాయాలపై ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉండగా ప్రభుత్వం అలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఫలితంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తడిసిన ధాన్యం, నిల్వ సమస్యలు, కొనుగోలు ఆలస్యం వంటి కారణాలతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాడుతుందని, రైతు వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.



# యూరియా యాప్‌పై ఆందోళన వద్దు : వ్యవసాయ అధికారిణి శ్వేత

- యాప్ విధానంతో ప్రతి ఎకరానికీ యూరియా
- కౌలు రైతులకూ యాప్ ద్వారా సులభంగా ఎరువులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 30(డీడీ9 వార్త) :**

యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానంపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మండలంలో సాగయ్యే ప్రతి ఎకరానికీ ఎరువులు అందుతాయని మండల వ్యవసాయ అధికారిణి శ్వేత స్పష్టం చేశారు. సాలూర మండల కేంద్రం రైతు వేదికలో యూరియా యాప్ పనితీరు, ఎరువుల పంపిణీ విధానంపై శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులతో కలసి రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. గత నెల 27వ తేదీన యాప్ ప్రారంభమైనప్పటి నుంచి ఎరువుల లభ్యతపై రైతాంగంలో నెలకొన్న గందరగోళం, సందేహాలను తొలగించేందుకు ఆమె రైతులతో సమావేశమై మాట్లాడారు. యాప్ ద్వారా యూరియాను ఎలా బుక్ చేసుకోవాలి, పంపిణీ ఏ విధంగా జరుగుతుందనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఏఓ శ్వేత మాట్లాడుతూ... యాప్‌లో మండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణించడం వల్ల ఏ గ్రామానికి చెందిన రైతు అయినా సులభంగా యూరియా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతుల సాగు భూమి విస్తీర్ణాన్ని బట్టే ఎరువుల కోటాను యాప్‌లోనే ముందే నిర్ధారించారని, ప్రతి ఎకరానికి ఒక బస్తా చొప్పున విడతలవారీగా కేటాయింపులు ఉంటాయని స్పష్టం చేశారు. మొదటి విడతలో బుక్ చేసుకున్న వారికి 15 రోజుల తర్వాత రెండో విడత కింద నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. మండలంలో దాదాపు 14 వేల ఎకరాల సాగు భూమి ఉందని, దానికి సరిపడా ఎరువుల అవసరాలను ముందే ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. ఇప్పటికే 8 వేల బస్తాల యూరియా అందుబాటులోకి వచ్చిందని, మిగిలిన 5 నుంచి 6 వేల బస్తాలను త్వరలోనే రప్పిస్తామని హామీ ఇచ్చారు. ఎరువుల మళ్లింపునకు ఎక్కడా ఆస్కారం లేదని, నిల్వలు లేవనే భయంతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. యాప్ ద్వారా బుకింగ్ సమయాలను కూడా నిర్ణయించామని, ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు మరియు మధ్యాహ్నం 3 గంటలకు సొసైటీలోని నిల్వలను బట్టి స్టాక్‌ను యాప్‌లో ఉంచుతామని వివరించారు. ఈ వివరాలను ఒక రోజు ముందే రైతుల వాట్సాప్ గ్రూపుల ద్వారా గానీ, గ్రామాలల్లో దండోరా వేయించడం ద్వారా గానీ తెలియజేస్తామన్నారు. యాప్‌లో బుక్ చేసుకున్న 24 గంటల్లోగా యూరియాను తీసుకోకపోతే ఆ బుకింగ్ రద్దవుతుందని, అలా నష్టపోకుండా ఉండేందుకే విడతలవారీగా గడువు ఇస్తున్నామని చెప్పారు. జూన్ 11వ తేదీతో మొదటి విడత పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాతే తదుపరి విడత బుకింగ్స్ ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. కౌలు రైతుల కోసం యాప్‌లో 'సిటిజన్' అనే ప్రత్యేక ఆప్షన్ ఉందని, అందులో నమోదు చేసుకుంటే నేరుగా వారి మొబైల్‌కే ఓటీపీ వస్తుందని దీనివల్ల కౌలుదారులు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పొందవచ్చని వివరించారు. ఇక ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే యూరియాకు లింకు సరుకు ఇస్తున్నారనే రైతుల ఫిర్యాదులపై ఆమె స్పందిస్తూ సీజన్ ప్రారంభంలో రైతులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే సొసైటీలు ప్రైవేట్ నుంచి ముందే స్టాక్ తెప్పించాయని, అందువల్ల కొన్ని లింకులు తప్పనిసరవుతున్నాయని పేర్కొన్నారు. అయితే రైతులకు ఉపయోగపడే నానో యూరియా, నానో డీఏపీలనే లింకుగా ఇస్తున్నారని, వీటిని మొదటి విడతలో కాకపోయినా రెండో విడతలో చల్లుకోవడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుందని సూచించారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి సబ్సిడీపై అందిస్తున్న ఈ యూరియాను పరిశ్రమలకు, ఇతర అవసరాలకు తరలకుండా అడ్డుకట్ట వేసేందుకే భూవిస్తీర్ణ ఆధారిత యాప్ విధానాన్ని తీసుకువచ్చిందని రైతులంతా ఈ నూతన పద్ధతికి సహకరించాలని ఏఓ శ్వేత కోరారు. ఈ సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అల్లే జనార్దన్, ఇంచార్జి కార్యదర్శి సంజీవ్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.








# కటాఫ్ తొలగించి.. రూ.4 వేల పింఛను ఇవ్వాలి

- ఎడపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీడీ కార్మికుల ధర్నా
- కాంగ్రెస్ ప్రభుత్వంపై టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేష్ ధ్వజం

**బోధన్, నిజామాబాద్, మే 30(డీడీ9 వార్త) :**

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా, కటాఫ్ తేదీని తక్షణమే తొలగించి బీడీ కార్మికులందరికీ రూ.4 వేల పింఛను అందించాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీయూసీఐ బోధన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో పాటు, కార్మికుల వ్యక్తిగత దరఖాస్తులను ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి బి.మల్లేష్ మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బీడీ కార్మికులకు కటాఫ్ తేదీని తొలగిస్తామని, పెన్షన్ రానివారికి కొత్తగా రూ.4 వేలు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం రూ.2016 వస్తున్న వారికి సైతం రూ.4 వేలకు పెంచుతామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ మహిళా బీడీ కార్మికులకు పింఛన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే మహిళల ఉసురు తగిలి అధికారాన్ని కోల్పోయారని విమర్శించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే నేడు కాంగ్రెస్ పార్టీ కూడా మహిళా బీడీ కార్మికులను మోసం చేయాలని చూస్తే అదే గతి పడుతుందని హెచ్చరించారు. కేవలం మాటలతో కోటీశ్వరులను చేస్తామంటూ కాలం వెళ్లదీయకుండా, ఎన్నికల వాగ్దానాన్ని వెంటనే నిలబెట్టుకుని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీడీ కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘ నాయకులు గంగాధర్, భాగ్య, గంగాలక్ష్మి, సుజాత, లక్ష్మి, రమ, సునంద, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

**నిజామాబాద్ జిల్లా, మే 30(డీడీ9 వార్త) :**

భీంగల్ మండలంలోని కుప్కల్ గ్రామంలో శనివారం జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యతను పరిశీలించి, కూలీలతో నేరుగా మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఇంకా ప్రారంభం కానందున, గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి హామీ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ తప్పనిసరిగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పనులకు హాజరై ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో కూలీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. పని ప్రదేశంలో కూలీలకు ఇబ్బంది కలగకుండా తాగునీటి వసతితో పాటు, ఎండ దెబ్బ తగలకుండా అవసరమైన నీడ సౌకర్యం మరియు అత్యవసర వైద్యం కోసం ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా, తమకు ఉపాధి హామీ వేతనాలు సకాలంలో బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుండడం పట్ల కూలీలు ఎంపీడీవో వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో జి. నరసయ్య, గ్రామ సర్పంచ్ నరసింగరావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.






# పోలీస్ శాఖలో సేవలు అభినందనీయం : సీపీ పి.సాయిచైతన్య

- ఆరుగురు సిబ్బందికి ఘనంగా వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా, మే 30(డీడీ9 వార్త) :**

పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడి ఉన్నప్పటికీ, ఎలాంటి రిమార్కులు లేకుండా నిష్కళంకంగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య కొనియాడారు. జిల్లా పోలీస్ శాఖలో ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న ఆరుగురు పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య పదవీ విరమణ పొందిన వారిని శాలువాలతో సత్కరించి, సర్టిఫికేట్లతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది సహజ ప్రక్రియేనని, అయితే సమాజ రక్షణలో కీలకమైన పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం సేవలు అందించడం విశేషమన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అందించిన సేవలను ఆయన అభినందించారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీస్ శాఖ తరపున ఎలాంటి అవసరాలు వచ్చినా తాము ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రిటైర్ అయిన అధికారులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సంతోషంగా శేషజీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అహమ్మద్ అబ్దుల్ బషీర్: ఆఫీస్ సూపరింటెండెంట్ (నిజామాబాద్) 41 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకున్నారు. బాదావత్ శివరాం: ఎస్సై, సీసీఆర్‌బీ (నిజామాబాద్) 37 సంవత్సరాల సేవలు అందించారు. గైక్వాడ్ అప్పారావు: ఎస్సై, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ 42 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేశారు. సేరుపల్లె మొగులయ్య: ఎస్సై, మాక్లూర్ పోలీస్ స్టేషన్ 37 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించారు. ముప్వ లింగారావు: ఏఎస్సై, సీఎస్‌బీ (నిజామాబాద్) 36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నారు. మస్కే జీవన్: హెడ్ కానిస్టేబుల్ (2817), ఆర్మూర్ పోలీస్ స్టేషన్ 33 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలు అందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, హోంగార్డ్స్ ఏసీపీ కె.దీపక్ చంద్ర, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, ఎ. జగతి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్ (అడ్మిన్), ఎస్.శేఖర్ బాబు (ఎంటీఓ), సతీష్ (వెల్ఫేర్/హోంగార్డ్స్), పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షాకిల్ పాషా, రిటైర్డ్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే.. వారంలో 138 కేసులు నమోదు

- రూ.11.10 లక్షల జరిమానా, తొమ్మిది మందికి జైలు శిక్ష
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడి

**నిజామాబాద్ జిల్లా, మే 30(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గడిచిన ఒక వారంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 138 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పట్టుబడిన వారందరినీ నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో హాజరపర్చగా, న్యాయమూర్తులు వారిలో తొమ్మిది మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారని, మిగిలిన వారికి రూ.11,10,000/ భారీ జరిమానా విధించారని సీపీ పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్ల సమీపంలో ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు పోలీస్ కమిషనర్ పలు కీలక సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ ఆరు నెలల పాటు సస్పెండ్ చేయబడుతుందని హెచ్చరించారు. ఒకసారి కంటే ఎక్కువసార్లు పట్టుబడిన వారికి ఖచ్చితంగా జైలు శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి అనుకోని రోడ్డు ప్రమాదానికి గురైతే ఎలాంటి ఇన్సూరెన్స్ లభించదని గుర్తుచేశారు. ముఖ్యంగా మైనర్లు తాగి వాహనాలు నడిపితే, సదరు మైనర్లతో పాటు వాహన యజమానుల పైన కూడా ఛార్జ్‌షీట్ నమోదు చేసి జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. మోటార్ వెహికల్ యాక్ట్ సవరణ2019 ప్రకారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొదటిసారి పట్టుబడితే పది వేల రూపాయల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే పదిహేను వేల రూపాయల జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. వాహనదారులు ఎల్లప్పుడూ వాహన పత్రాలను సక్రమంగా తమ వద్ద ఉంచుకోవాలని, నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

# పోలీస్ వ్యవస్థలో ఏకరీతి విధానాలు అమలు చేయాలి

- ఉన్నతాధికారులతో రాష్ట్ర పోలీస్ బాస్ వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, మే 30(డీడీ9 వార్త) :**




రాష్ట్ర పోలీస్ శాఖలో మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజా అనుకూల సేవలను అందించేందుకు స్టాండరైజ్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ అమలుకు ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ సూచించారు. శనివారం ఆయన రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై సమగ్ర సమీక్ష జరిపారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు తక్షణ సహాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అన్ని అంశాలలోనూ ఒకే విధమైన పద్ధతులను పాటించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని డీజీపీ స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. పెరుగుతున్న సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడంతో పాటు అక్రమ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సిబ్బంది క్రమశిక్షణతో ఉంటూ లోనికి వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి ప్రజల్లో మునుపటి కంటే ఎక్కువ నమ్మకాన్ని పెంపొందించాలని అధికారులను కోరారు. నిజామాబాద్ నగరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ పాల్గొన్నారు. వీరితో పాటు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సీటీసీ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తదితరులు పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుండి హాజరయ్యారు.

# మంతెనలో పేకాట స్థావరంపై 'చీతా ఫోర్స్' దాడి : తొమ్మిది మంది అరెస్ట్

- కార్లు, బైక్, మొబైళ్లు, నగదు స్వాధీనం

**నిజామాబాద్ జిల్లా, మే 30(డీడీ9 వార్త) :**

ఆర్మూర్ మండలంలోని మంతెన గ్రామంలో గురుడు కాపు సంఘం భవనంలో అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు మెరుపు దాడి చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ సిబ్బంది ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నమ్మదగిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. భవనంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది పేకాట రాయుళ్లను రౌండప్ చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4,880 నగదుతో పాటు 10 మొబైల్ ఫోన్లు, 3 కార్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పేకాట, జూదం వంటి అక్రమ వ్యసనాలు ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా రోడ్డున పడేస్తాయని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనరేట్ పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో అక్రమ పేకాట, జూదం, మద్యం, మాదకద్రవ్యాల విక్రయాలు వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఇలాంటి అసాంఘిక పనులు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.



# ప్రేమ పేరుతో బ్లాక్ మెయిల్ కి పాల్పడిన తూప్రాన్ కి చెందిన సాధనాల సంతోష్ అరెస్ట్

**(డిడి9 వార్త),మేడ్చల్:**

ప్రేమ,పెళ్ళి పేరుతో యువతిని నమ్మించి లైంగికంగా వేధించి, బ్లాక్ మెయిల్ కు పాల్పడిన వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ కి చెందిన సాధనాల సంతోష్ మేడ్చల్ లోని సి ఎం ఆర్ కాలేజీలో బి ఫార్మసీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అదే కాలేజీలో చదువుతున్న జవహర్ నగర్ కి చెందిన అమ్మాయితో పరిచయం ఏర్పడింది. అదే అదునుగా భావించిన తూప్రాన్ కి చెందిన సాధనాల సంతోష్ ఆ అమ్మాయిని మాయమాటలు చెప్పి ప్రేమా,పెళ్ళి పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.బాధితురాలితో దిగిన ఫోటోలను తమ వారికి పంపిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు.బాధితురాలు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అక్కడ




జీరో FIR చేసి మేడ్చల్ పోలీస్ స్టేషన్ కి బదిలీ చేశారు.రంగంలో దిగిన మేడ్చల్ సీఐ సత్యనారాయణ నిందితుడిని అరెస్ట్ చేసి పలు సెక్షన్ ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు..

## తూప్రాన్ లో పెద్దమ్మ దేవాలయాలో చోరీ... కుర్మా నర్సింహా స్వామి ఆలయంలో విగ్రహాలు ధ్వంసం...

**తూప్రాన్ మే 30 (డిడి9 వార్త)**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ లోని రెండు దేవాలయాల్లో దొంగల భీభత్సం .. పెద్దమ్మ దేవాలయంలో డోర్ ధ్వంసం చేసి అమ్మవారి మూడు జతల పుస్తె మట్టెలు బంగారు ముక్కు పుడక, మరియు 10 వేల విలువ గల ఒక్క గ్రామ్ నెక్లెస్, 50 వేల రూపాయల పూజసామాగ్రి పెద్ద గంట అపహరించారు అలాగే పురాతన ఆలయంలో కప్పెర కుర్మా నర్సింహ స్వామి దేవాలయంలో విగ్రహాలను పూర్తిగా ధ్వంసం..చేశారు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ధర్యాప్తు చేస్తున్నారు ఆలయాలో చోరీ విగ్రహాల ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు..




## ఐటీసీ సహకారంతో చెరువుల పునరుద్ధీకరణ...

- **కొండాపూర్ సర్పంచ్ రాము యాదవ్...**

**డిడి9 వార్త, మనోహరబాద్ మే 30 :**

ఐటీసీ సంస్థ సహకారంతో గ్రామంలో చెరువు కట్ట మరమ్మత్తులు ప్రారంభం చేసినట్లు కొండాపూర్ సర్పంచి రామ్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన శనివారం నాడు ఐటీసీ సంస్థ సహకారతో చెరువు కట్ట మరమ్మత్తులు ప్రారంభం చేశారు.గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు వికలాంగులు కూడా ఐటీసీ సంస్థ ద్వారా లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు ఐటీసీ సంస్థ ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.



# అమ్మ మాట అంగన్వాడి బాట

- **అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి**
- **సమావేశంలో సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ వెల్లడి.**

**చిగురుమామిడి,మే 30 (డిడి9 వార్త):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాటఅంగన్వాడీ బడి బాట కార్యక్రమం సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ భవాని మాట్లాడుతూ అంగన్వాడి స్కూల్లో మూడేళ్లు నిండిన చిన్నారుల నమోదును పెంచడానికి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట అని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా మూడేళ్లు నిండిన అర్హులైన పిల్లలను అంగన్వాడీలలో చేర్పించడానికి తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.తల్లులతో పిల్లలను అంగన్వాడీ కీ పంపించాలని,అంగన్వాడీ కేంద్రంలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.అంగన్వాడీ పిల్లలకు యూనిఫామ్ లను పంపిణీ చేశారు. ప్రిస్కూల్ పిల్లలకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయలక్ష్మి రాజు యాదవ్,ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇశ్రత్ సుల్తానా,వార్డ్ సభ్యులు రాకం అంజవ్వ,అంగన్వాడీ టీచర్లు పన్యాల అనురాధ, గొల్లపల్లి ధనలక్ష్మి,ఉల్లెంగుల ఇందిర,బెజ్జంకి సంపూర్ణ,పిల్లలు, పిల్లల తల్లులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## తూప్రాన్ మండలంలో నాలుగు పాఠశాలల్లో ప్రీప్రైమరీ విభాగాల ప్రారంభం

**డిడి9 వార్త, తూప్రాన్ మే 30**

202627 విద్యా సంవత్సరానికి తూప్రాన్ మండలంలోని యూపీఎస్ రావెల్లి, పీఎస్ వెంకటాయిపల్లి, పీఎస్ మల్కాపూర్, పీఎస్ కొన్నాయిపల్లి (పీబీ) పాఠశాలలకు మంజూరైన ప్రీప్రైమరీ విభాగాలు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టును భర్తీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ అర్హతతో పాటు పూర్వ ప్రాథమిక విద్యలో డీఈడీ చేసిన మహిళలకు ప్రాధాన్యత ఇస్తారు. అలాంటి అభ్యర్థులు అందుబాటులో లేకపోతే ఇంటర్ ఉత్తీర్ణులైన మహిళలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇంటర్ కంటే ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నప్పటికీ ఇంటర్ మార్కులనే ఎంపికకు ఆధారంగా తీసుకుంటారు. ఆయా పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులు. ఉన్నత విద్యార్హతలు ఉన్నప్పటికీ పదో తరగతి మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. రెండు పోస్టులకూ సంబంధిత గ్రామానికి చెందిన ప్రస్తుత నివాసితులకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. గ్రామంలో అర్హులు లేని పక్షంలో సమీప గ్రామం, మండలం, జిల్లా నుంచి వరుస క్రమంలో ఎంపిక చేస్తారు. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8,000, ఆయాకు నెలకు రూ.6,000 వేతనం చెల్లిస్తారు. దరఖాస్తుల స్వీకరణ తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులను ఏఏపీసీ ఆధ్వర్యంలో సంబంధిత ప్రధానోపాధ్యాయులు స్వీకరిస్తారు. పోస్టుల భర్తీ ప్రక్రియ పాఠశాల, మండల లేదా జిల్లా స్థాయిలో నిర్వహించాలనే అంశంపై జిల్లా కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రీప్రైమరీ విభాగాలు మంజూరైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అడ్మిషన్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో కనీసం 25 మంది విద్యార్థుల ప్రవేశాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సూచించినట్లు తెలిపారు. ప్రీప్రైమరీ విభాగాల నిర్వహణకు అవసరమైన కనీస వసతుల కల్పన కోసం నిధులను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని డైరెక్టర్ ఆదేశించినట్లు తూప్రాన్ మండల విద్యాధికారి తెలిపారు.




# నీరు వృధాగా పోతున్న పట్టించుకోని అధికారులు

**(డిడి9 వార్త)మేడ్చల్:**

వేసవి నేపథ్యంలో పలు ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ ఉంటే..మేడ్చల్ జిల్లా సైబరాబాద్ మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ లో మాత్రం ట్యాంకు నిండి పై నుంచి గంటల తరబడి వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని పై అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.నిత్యం గుక్కెడు నీటి కోసం పట్టణ వాసులు గోసపడుతుంటే, ఏ పూటకు ఆ పూట నీళ్లు తెచ్చుకుంటూ కాలం వెళ్లదీస్తున్న దుస్థితి నెలకొంటుటే వృధాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు.తాగునీటి సరఫరా కోసం ట్యాంక్ ని నింపి ఆర్టీసీ కాలనీతో పాటు పలు కాలనీలకు వాల్స్ ద్వారా నీటిని విడుదల చేస్తారు.కానీ వాటర్మ్యాన్ మాత్రం విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడు. నీటి సరఫరాను సరిగ్గా పట్టించుకోకపోవడంతో ట్యాంక్ నిండిన తర్వాత గంటల తరబడి నీరు వృథాగా పోతుంది. కొద్ది రోజులుగా ఇలాగే ట్యాంక్ నుంచి నీరు వృథాగా వెళ్లిపోతుందన్నారు.



## తూప్రాన్ కొత్త కమిషనర్ గా రమేష్

**డిడి9 వార్త, తూప్రాన్**

తూప్రాన్ మున్సిపల్ నూతన కమిషనర్ గా రమేష్ నియమితులయ్యారు. ప్రభుత్వం శనివారం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్ గా పనిచేసిన పాతూరి గణేష్ రెడ్డి గజ్వేల్ కి బదిలీ కాగా ఆయన స్థానంలో రమేష్ బాధ్యతలు స్వీకరించనున్నారు. దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గా రమేష్ గతంలో విధులు నిర్వహించారు.



## మెదక్ జర్నలిస్ట్ ప్రసాద్ కూతురు ఎర్ర ప్రాణ్య కు గిన్నిస్ రికార్డు...

- **గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు ..**

**మెదక్ (డిడి9 వార్త ) ప్రతినిధి**

మెదక్ ప్రాంతానికి చెందిన ఐదేళ్ల చిన్నారి ఎర్ర ప్రాణ్య జర్నలిస్ట్ ఎర్ర ప్రసాద్ కూతురు ఎర్ర ప్రాణ్య గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించింది. మెదక్ పట్టణానికి దయారా విధికి చెందిన జర్నలిస్ట్ ఎర్ర ప్రసాద్ కూతురు ఎర్ర ప్రాణ్యాకు గిన్నిస్ రికార్డ్ రావడం మెదక్ పట్టణవాసులు సంతోషించారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్ నగరంలో నిర్వహించిన కీబోర్డు ప్రతిభ పోటీల్లో పాల్గొని గంట పాటు కీబోర్డును ఆపకుండా వాయిస్తూ రికార్డు సృష్టించారు. ఈ పోటీల్లో 22 దేశాల నుంచి 2000 మంది కీబోర్డ్ వాయిద్యా కారులు పాల్గొన్నారు .ఇందులో ప్రతిభ చూపిన 777 మందికి రికార్డుల్లో చోటు లభించింది ప్రాణ్యాకు శుక్రవారం గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జర్నలిస్ట్ ప్రసాద్ మాట్లాడుతూ మా కూతురు ఎర్ర ప్రాణ్య కు గిన్నిస్ రికార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు..



# రియాన్ పరాగ్ వ్యాఖ్యలపై కోచ్ సంగక్కర అసంతృప్తి.. ఏం జరిగిందంటే..!

- **ఆర్ఆర్ ప్లేఆఫ్స్‌కు చేరుతుందని ఎవరూ ఊహించలేదన్న కెప్టెన్ పరాగ్**
- **ఈ వ్యాఖ్యలతో విభేదించిన కోచ్ సంగక్కర**
- **టైటిల్ కోసమే జట్టు ఎంపిక చేస్తామని స్పష్టీకరణ**
- **పరాగ్ కెప్టెన్సీపై సంగక్కర ప్రశంసలు**
- **వచ్చే సీజన్లో మరింత బలంగా వస్తామని ధీమా**

**డిడి9 వార్త:**

రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్లేఆఫ్స్ అర్హత పై కెప్టెన్ రియాన్ పరాగ్ చేసిన వ్యాఖ్యలతో హెడ్ కోచ్ కుమార సంగక్కర పూర్తిగా విభేదించారు. ఐపీఎల్ క్వాలిఫైయర్ 2 మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ ఇద్దరి మధ్య భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**రియాన్ ఏమన్నాడంటే?**

ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఎక్కువ మంది యువకులు, అనుభవం లేని ఆటగాళ్లు ఉన్నారని కెప్టెన్ రియాన్ పరాగ్ పేర్కొన్నాడు. ఈ కారణంగా తమ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుందని ఎవరూ ఊహించలేదని, అసలు తాము టాప్ 4లో ఉంటామనీ అనుకోలేదని పరాగ్ మ్యాచ్ అనంతరం వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

**కోచ్ సంగక్కర అసంతృప్తి**

కెప్టెన్ చేసిన వ్యాఖ్యలపై కోచ్ సంగక్కర అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాము కేవలం టైటిల్ గెలవాలనే మైండ్‌సెట్‌తోనే ఆటగాళ్లను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశాడు. కేవలం ప్లేఆఫ్స్ చేరడం తమ లక్ష్యం కాదని, అరంగేట్రం చేసిన ఆటగాళ్లు సైతం మ్యాచ్‌లు గెలిపించగలరనే నమ్మకంతోనే జట్టులోకి తీసుకుంటామని పరాగ్ వ్యాఖ్యలను కొట్టిపారేశాడు.

**మారిన రాజస్థాన్ వ్యూహాలు**

గత నాలుగేళ్లుగా రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని సంగక్కర వివరించాడు. రెండేళ్ల క్రితం వేలంలో తాము అనుకున్నట్లుగా బడ్జెట్‌ను పూర్తిగా ఉపయోగించుకోలేకపోయామని అంగీకరించాడు. జట్టులో కొంతమందికి అనుభవం లేకపోయినా ప్రతి ఒక్కరూ ఇక్కడ గెలవడానికే వచ్చారని చెప్పాడు.

**కెప్టెన్సీపై ప్రశంసలు**

వ్యాఖ్యల విషయంలో విభేదించినప్పటికీ కెప్టెన్‌గా రియాన్ పరాగ్ ప్రదర్శనను సంగక్కర అభినందించాడు. పూర్తిస్థాయి కెప్టెన్‌గా పరాగ్‌కు ఇది మొదటి సీజన్ అని, మైదానంలో అతను తీసుకున్న నిర్ణయాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడాడు. భవిష్యత్తులో మరింత మెరుగైన నాయకుడిగా ఎదుగుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

**విమర్శకుల నోళ్లు మూయించారు**

టోర్నీ ప్రారంభంలో రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్ చేరుతుందని ఎవరూ నమ్మలేదని సంగక్కర గుర్తు చేశాడు. బయటి వ్యక్తులు తమ సామర్థ్యాన్ని అనుమానించినా ఆటగాళ్లు కష్టపడి ఆడారన్నాడు. ఈ ఓటమి నుంచి నేర్చుకుని వచ్చే సీజన్ నాటికి మరింత బలంగా పునరాగమనం చేస్తామని ధీమా వ్యక్తం చేశాడు.



# రోహిత్‌ను ఎంపిక చేసి.. జైస్వాల్‌కు అన్యాయం చేశారు

- **ఆఫ్ఘన్ తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ఎంపికపై వివాదం**
- **యశస్వి జైస్వాల్‌ను తీసుకోకపోవడంపై మంజ్రేకర్ అసంతృప్తి**
- **జైస్వాల్‌కు సెలక్టర్లు క్షమాపణ చెప్పాలని సంచలన వ్యాఖ్య**
- **39 ఏళ్ల రోహిత్ ఎంపికపై తీవ్ర అభ్యంతరం**
- **2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకోవాలని సూచన**

**డిడి9 వార్త:**

ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్‌కు భారత జట్టు ఎంపికపై మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్‌ను పక్కనపెట్టి, 39 ఏళ్ల రోహిత్ శర్మను ఎంపిక చేయడంపై ఆయన అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీని తప్పుబట్టారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు సెలక్టర్లు జైస్వాల్‌కు ఫోన్ చేసి క్షమాపణ చెప్పాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఒక స్పోర్ట్స్ పాడ్‌కాస్ట్‌లో మంజ్రేకర్ మాట్లాడుతూ.. "చివరిగా ఆడిన వన్డేలో అజేయ శతకం (116) సాధించిన జైస్వాల్‌ను జట్టులోకి తీసుకోకపోవడంలో అర్థం లేదు. మరోవైపు, ఫిట్‌నెస్, ఫామ్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోహిత్ శర్మకు చోటు కల్పించారు. దీని వెనుక ఉన్న తర్కం ఏంటో వివరించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో రోహిత్‌ను ఎంపిక చేయాల్సి వస్తే, ముందుగా జైస్వాల్‌కు ఫోన్ చేసి క్షమాపణ చెప్పాలి. ఎందుకంటే అతను అత్యున్నత స్థాయిలో అద్భుతంగా రాణిస్తున్న యువ కెరటం" అని అన్నారు.

2027 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, జట్టు భవిష్యత్తు కోసం ఆలోచించాల్సిన అవసరం ఉందని మంజ్రేకర్ సూచించారు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ వంటి యువ ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వడం ద్వారా బలమైన జట్టును నిర్మించాలని అభిప్రాయపడ్డారు. మంజ్రేకర్ వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.





# ఏషియన్ గేమ్స్ రేసులో వైభవ్.. సూర్య, గిల్‌కు దక్కని చోటు!

- **ఏషియన్ గేమ్స్ కోసం 30 మందితో ప్రాథమిక జాబితా**
- **విండీస్ సిరీస్ వల్ల రెండు వేర్వేరు జట్ల ఎంపిక**
- **భవిష్యత్తు ప్రణాళికల్లో సూర్యకుమార్ యాదవ్‌కు నిరాశ**
- **కెప్టెన్ రేసులో అయ్యర్, శాంసన్, తిలక్ వర్మ**

**డిడి9 వార్త:**

ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) భారీ వ్యూహాన్ని సిద్ధం చేసింది. జపాన్‌లోని ఐచీనగోయాలో జరగనున్న ఈ పోటీల కోసం 30 మందితో కూడిన ప్రాథమిక జాబితాను ఐఓఏకు సమర్పించింది. ఈ లిస్ట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కగా.. స్టార్ ప్లేయర్లు సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్‌ల పేర్లు లేకపోవడం హాట్ టాపిక్‌గా మారింది.

**ఒకేసారి రెండు సిరీస్‌లు**

సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. అదే సమయంలో సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ స్వదేశంలో వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ రెండు సిరీస్‌లు ఒకే సమయంలో వస్తుండటంతో బీసీసీఐ రెండు వేర్వేరు టీమ్‌లను బరిలోకి దించుతోంది. విండీస్ సిరీస్‌లో గిల్ వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉండటం వల్లే అతణ్ని ఏషియన్ గేమ్స్ లిస్ట్‌లో చేర్చలేదని తెలుస్తోంది.

**సూర్యకుమార్‌పై వేటు?**

భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేరు ఈ లిస్ట్‌లో లేకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే 2028 ఒలింపిక్స్, తదుపరి టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని సెలక్టర్లు యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. సూర్య ఇకపై భవిష్యత్తు ప్రణాళికల్లో లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ జట్టుకు శ్రేయస్ అయ్యర్, సంజూ శాంసన్ లేదా తిలక్ వర్మలలో ఒకరు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.

**బుమ్రాకు చోటు**

ఈ ప్రాథమిక జాబితాలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పేరు ఉన్నప్పటికీ అతడు విండీస్ వన్డే సిరీస్‌కే ప్రాధాన్యం ఇవ్వనున్నాడు. గాయం నుంచి కోలుకుంటున్న హర్షిత్ రాణాతో పాటు ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లకు చోటు దక్కింది. స్పిన్నర్లలో కుల్దీప్, అక్షర్, సుందర్, హర్ష్ దూబేలను ఎంపిక చేశారు. వీరిలో ఇద్దరు ఏషియన్ గేమ్స్‌కు వెళుతుండగా, మిగిలిన ఇద్దరు విండీస్ సిరీస్ ఆడనున్నారు. గతంలో పసిడి గెలిపించిన రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కింది.



**30 మంది వీరే**

యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్, ఆయుష్ బదోని, హర్ష్ దూబే, ధ్రువ్ జురెల్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, షాబాజ్ అహ్మద్, శివం దూబే, విప్రజ్ నిగమ్, హర్షిత్ రాణా, యశ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్.

# వినేశ్ ఫోగాట్‌కు తీవ్ర నిరాశ... ఆసియా క్రీడలకు అర్హత సాధించడంలో విఫలం

- **ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో వినేశ్ ఫోగాట్ ఓటమి**
- **మహిళల 53 కేజీల విభాగం సెమీఫైనల్స్‌లో ఓటమితో నిష్క్రమణ**
- **మీనాక్షి గోయత్ చేతిలో 4-6 తేడాతో ఓడిపోయిన వినేశ్**
- **ట్రయల్స్‌కు ముందు బరిలోకి దిగడంపై నెలకొన్న ఉత్కంఠ**

**డిడి9 వార్త:**



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. 2026 ఆసియా క్రీడలకు అర్హత సాధించాలన్న ఆమె కల చెదిరిపోయింది. శనివారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో వినేశ్ సెమీఫైనల్స్‌లోనే ఓటమి పాలైంది. మహిళల 53 కేజీల విభాగంలో జరిగిన హోరాహోరీ సెమీఫైనల్ పోరులో మీనాక్షి గోయత్ చేతిలో ఆమె 46 తేడాతో ఓడిపోయింది.

ఈ ఓటమితో జపాన్‌లోని ఐచినగోయాలో జరగనున్న ఆసియా క్రీడలకు అర్హత సాధించే అవకాశాన్ని వినేశ్ కోల్పోయింది. గత 48 గంటలుగా నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఆమె ప్రస్థానం చివరికి నిరాశతో ముగిసింది. సుప్రీంకోర్టు జోక్యంతో చివరి నిమిషంలో వినేశ్‌కు ఈ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. తొలుత ఆమెను 50 కేజీల విభాగంలో పోటీ చేయాలని డబ్ల్యూఎఫ్ఐ చెప్పగా, ఆమె వ్యతిరేకించింది. చివరికి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ జోక్యంతో ఆమె కోరుకున్న 53 కేజీల విభాగంలోనే పోటీ చేసేందుకు అనుమతి లభించింది.

ట్రయల్స్‌లో వినేశ్ అద్భుతంగానే ప్రారంభించింది. తొలి రౌండ్‌లో జ్యోతిపై 71 తేడాతో, ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్ ఫైనల్‌లో నిషపై 76 తేడాతో గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. అయితే, కీలకమైన సెమీఫైనల్‌లో మీనాక్షి గోయత్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరి వరకు పోరాడినప్పటికీ వినేశ్‌కు ఓటమి తప్పలేదు. సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగి, అనేక పరిపాలనాపరమైన అడ్డంకులను దాటి ట్రయల్స్‌కు వచ్చిన వినేశ్‌కు ఈ ఫలితం తీవ్ర నిరాశను మిగిల్చింది.

# రూ.1.10 కోట్లకు కొంటే.. రూ.33 కోట్ల లాభం.. ఐపీఎల్‌ను షేక్ చేసిన వైభవ్ సూర్యవంశీ!

- **ఐపీఎల్ 2026లో రాజస్థాన్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సంచలనం**
- **రూ.1.10 కోట్లకు కొనుగోలు చేస్తే.. రూ.34.97 కోట్ల విలువైన ప్రదర్శన**
- **ఈ సీజన్‌లో రూ.33.87 కోట్ల లాభంతో అత్యధిక లాభదాయక ఆటగాళ్లలో మూడో స్థానం**
- **పవర్‌ప్లేలో ఆధిపత్యం.. ప్లేఆఫ్స్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో అదరగొట్టిన వైనం**
- **తర్వాతి వేలంలో ఇతని ధర కనీసం రూ.15-18 కోట్లు పలకవచ్చని అంచనా**

**డిడి9 వార్త:**

ఐపీఎల్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, అదో పెద్ద వ్యాపార సామ్రాజ్యం. ఇక్కడ ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరిస్తాయి. కొందరు స్టార్లు నిరాశపరిస్తే, కొందరు యువ ఆటగాళ్లు పెట్టిన డబ్బుకు వంద రెట్ల విలువను అందించి ఆశ్చర్యపరుస్తారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో సరిగ్గా అలాంటి అద్భుతాన్నే ఆవిష్కరించాడు రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. కేవలం రూ.1.10 కోట్ల వేలంలో దక్కిన ఈ కుర్రాడు, తన ప్రదర్శనతో ఏకంగా రూ.34.97 కోట్ల విలువను సృష్టించాడు. అంటే.. ఫ్రాంచైజీకి నికరంగా రూ.33.87 కోట్ల లాభాన్ని అందించాడు.

ఈ గణాంకాలు ఒక ప్రత్యేకమైన ప్లేయర్ ఇంపాక్ట్ మోడల్ విశ్లేషణ ద్వారా వెల్లడయ్యాయి. ఐపీఎల్ 2026 బాల్‌టుబాల్ డేటాను విశ్లేషించి, ప్రతి డెలివరీకి ఆటగాడు జోడించిన గెలుపు అవకాశాన్ని (Win Probability Added) లెక్కించి, దానిని ద్రవ్య రూపంలోకి మార్చడం ద్వారా ఈ అంచనా వేశారు. ఈ లెక్కన రాజస్థాన్ రాయల్స్ సూర్యవంశీపై పెట్టిన ప్రతి రూపాయికి, అతను తిరిగి రూ.31.79 విలువైన ప్రదర్శన ఇచ్చాడు. ఈ సీజన్‌లో అత్యధిక లాభం ఆర్జించిన ఆటగాళ్ల జాబితాలో శుభ్‌మన్ గిల్ (రూ.35.14 కోట్లు), రజత్ పటీదార్ (రూ.35.06 కోట్లు) తర్వాత సూర్యవంశీ మూడో స్థానంలో నిలిచాడు. అయితే, గిల్, పటీదార్‌ల వేలం ధరలు వరుసగా రూ.16.50 కోట్లు, రూ.11.00 కోట్లు కాగా, సూర్యవంశీ చాలా తక్కువ పెట్టుబడితోనే వారి సరసన నిలవడం విశేషం.

**పవర్‌ప్లేలో విధ్వంసం.. ప్లేఆఫ్స్‌లో వీరవిహారం**

ఈ సీజన్‌లో సూర్యవంశీ పవర్‌ప్లేలో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. అతను సాధించిన మొత్తం 776 పరుగులలో 521 పరుగులు తొలి ఆరు ఓవర్లలోనే రాబట్టాడు. జైపూర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కేవలం 36 బంతుల్లో సెంచరీ చేసి, ఐపీఎల్ చరిత్రలోనే మూడో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అదే జట్టుపై ఎలిమినేటర్ మ్యాచ్‌లో 29 బంతుల్లో 97 పరుగులు చేసి 334.48 స్ట్రైక్ రేట్‌తో విధ్వంసం సృష్టించాడు. క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు 47 బంతుల్లో 96 పరుగులు చేసి తన పరిణతిని చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతని పుల్ షాట్ ఒక ప్రత్యేక ఆయుధంగా మారింది. ఈ షాట్ ద్వారా 20 సిక్సర్లు బాదిన అతను, కేవలం ఒక్కసారి మాత్రమే ఔటయ్యాడు. తాను ఎదుర్కొన్న 44 మంది బౌలర్లలో 31 మందిపై సిక్సర్లు కొట్టాడు. వీరిలో 8 మంది బౌలర్లను ఎదుర్కొనే క్రమంలో, మొదటి బంతినే సిక్సర్‌గా మలచడం అతని ఆత్మవిశ్వాసానికి నిదర్శనం.



**సృష్టించిన విలువ.. భవిష్యత్ అంచనా**

సూర్యవంశీ ఈ సీజన్‌లో సృష్టించిన రూ.33.87 కోట్ల లాభం ఎంత పెద్దదో చెప్పడానికి కొన్ని పోలికలు చూడొచ్చు. ఈ మొత్తంతో 252 మహీంద్రా థార్ కార్లు కొనవచ్చు లేదా 423 మంది విద్యార్థులు ఐఐటీలో నాలుగేళ్ల ఇంజినీరింగ్ పూర్తి చేయవచ్చు. రిషభ్ పంత్ (రూ.27 కోట్లు), జస్ప్రీత్ బుమ్రా (రూ.18 కోట్లు) వంటి స్టార్ల మొత్తం వేలం ధర కంటే సూర్యవంశీ ఒక్క సీజన్‌లో అందించిన లాభమే ఎక్కువ.

2025 మెగా వేలం సమయంలో అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా కేవలం రూ.1.10 కోట్ల కనీస ధరకు రాజస్థాన్ అతడిని కొనుగోలు చేసింది. ఆ తర్వాత అతడిని అదే ధరకు అట్టిపెట్టుకోవడం ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యుత్తమ నిర్ణయంగా నిలిచింది. రెండు ఐపీఎల్ సీజన్లలో 230కి పైగా స్ట్రైక్ రేట్‌తో 1,028 పరుగులు చేసిన అతని ట్రాక్ రికార్డుతో తదుపరి మెగా వేలంలో అతని కనీస ధర రూ.15 18 కోట్లు పలికినా ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
ఆదివారం
31-05-2026
హైదరాబాద్

## పూరి జగన్నాథ్ ఆగి ఆలోచించే రకం కాదు



తెలుగు సినిమా పరిశ్రమలో స్టార్ డైరెక్టర్లలో ఒకరిగా ఎన్నో సంవత్సరాలు విజయవంతంగా కెరీర్‌ను కొనసాగించిన దర్శకుడు పూరి జగన్నాథ్.హీరో పాత్రలను ప్రత్యేకంగా డిజైన్ చేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.ఒకప్పుడు పూరి దర్శకత్వంలో హీరోగా నటించేందుకు స్టార్ హీరోలు సైతం ఆసక్తి చూపేవారు. అయితే ఇటీవల కాలంలో ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమాలు మాత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. ఇదిలా ఉంటే ప్రముఖ కథా రచయిత, దర్శకుడు, నటుడు బివిఎస్ రవి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పూరి జగన్నాథ్‌తో తన అనుబంధం, ఆయన వర్కింగ్ స్టైల్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

రవి మాట్లాడుతూ... పూరి జగన్నాథ్ గారితో చాలా కాలం ప్రయాణం చేశాను. ఆయన వర్కింగ్ స్టైల్ అద్భుతంగా ఉంటుంది. ఆయనతో పని చేయడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. యూనిట్‌లో అందరికీ మంచి కంఫర్ట్ ఇస్తారు. ముఖ్యంగా సినిమా కథలను చాలా వేగంగా సిద్ధం చేయడం ఆయన ప్రత్యేకత" అని చెప్పారు. అయితే ఇటీవల కాలంలో పూరి కొంత స్లో అయ్యారని రవి అభిప్రాయపడ్డారు. అలాగే రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ఒకసారి "పూరి జగన్నాథ్ కాస్త ఆగి, లోతుగా ఆలోచించి కథలు రాస్తే ఆయనను ఆపడం ఎవరి వల్లా కాదు" అని చెప్పారని గుర్తు చేశారు. "అది నిజమే. కానీ పూరి జగన్నాథ్ తన స్టైల్‌లోనే ముందుకు వెళ్తారు. ఎక్కువగా ఆగి ఆలోచించే వ్యక్తి కాదు" అంటూ రవి పేర్కొన్నారు. తాజాగా పూరి జగన్నాథ్ గురించి బివిఎస్ రవి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## రణవీర్‌ను కాదు.. ఆ ఫిల్మ్ ఫెడరేషన్‌ను బ్యాన్ చేయాలి

ఇండస్ట్రీలో చర్చనీయాశమైన రణవీర్ సింగ్ బ్యాన్‌పై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. 'డాన్ 3' వివాదానికి సంబంధించి ఈ బాలీవుడ్ నటుడిపై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' విధించిన ఆంక్షలను ఆయన (Ram Gopal Varma) తప్పుపట్టారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఆ ఫిల్మ్ ఫెడరేషన్‌పై నిషేధం విధించాలని అన్నారు.

"గాంధీజీ పంథాలో అంటూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ విధించిన ఈ నిషేధం చూస్తుంటే.. వారిపై వారే వేసుకునే ఒక పెద్ద జోక్‌లా కనిపిస్తోంది. వాళ్లు చెబుతున్నట్లు ఇది పరిశ్రమను, కార్మికులను రక్షించే ప్రయత్నం కాదు. తమ (FWICE) పట్టును కోల్పోకుండా చూసుకోవడం కోసం చేస్తోన్న చర్యలు. వాళ్లు 5 నుంచి 50 లక్షల మంది కార్మికుల తరఫున మాట్లాడుతున్నామని చెబుతున్నారు. కానీ నిజం ఏంటంటే ఆ లక్షలాది మందిలో చాలామందికి ఈ వివాదానికి సంబంధించిన అసలు నిజాలు తెలియవు"

"అసలు ఇది న్యాయస్థానము కాదు, ప్రభుత్వ గుర్తింపు పొందిన నియంత్రణ సంస్థా కాదు. చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి.. ఒక నిర్దిష్ట ఎజెండాతో ప్రైవేటుగా సమావేశమయ్యే కొందరు వ్యక్తులు ఈ తీర్పును ముందే డిసైడ్ చేస్తారు. 'ధురంధర్' సినిమా భారీ విజయంతో రణవీర్ సింగ్ సాధించిన క్రేజ్ చూసి భయపడుతోన్న కొందరు నటులు కూడా ఇందులో సభ్యులుగా ఉన్నారు" అని వర్మ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. థియేటర్లలో టికెట్లు అమ్ముడయ్యేది రణవీర్ సింగ్ (Ranveer Singh) లాంటి స్టార్ల వల్లే అని.. ఇలాంటి సంస్థల వల్ల కాదని రామ్ గోపాల్ వర్మ అభిప్రాయపడ్డారు. రణవీర్ లాంటి స్టార్లే ఆ లక్షలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్నారని తెలిపారు.



## నాగచైతన్య వ్యక్తిత్వ హక్కులకు రక్షణ

తన పేరుని, చిత్రాల్ని వాణిజ్య వేదికల కోసం వినియోగించడంతోపాటు... అభ్యంతరకరమైన కంటెంట్‌తో ఆన్‌లైన్ దుర్వినియోగానికి పాల్పడటాన్ని సవాల్ చేస్తూ దిల్లీ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కథానాయకుడు నాగచైతన్యకు ఉపశమనం లభించింది. ఆయనకు మధ్యంతర రక్షణని కల్పిస్తూ ఉత్తర్వులిచ్చింది న్యాయస్థానం. నాగచైతన్య తరఫున న్యాయవాది వైభవ్ గగ్గర్ వాదనలు వినిపిస్తూ పలు వెబ్‌సైట్లు అభ్యంతరకమైన కంటెంట్‌తో పాటు, నటుడి వ్యక్తిగత జీవితానికి సంబంధించి పరువు నష్టం కలిగించే విషయాలూ ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తి జ్యోతిసింగ్ ఈ కేసుని విచారిస్తూ ప్రతివాదులకు సమన్లు జారీ చేసి, సమాధానాల్ని దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతిస్పందనల దాఖలు తర్వాత ఈ కేసు తదుపరి పరిశీలనకు రానుంది.



## మా శ్రమను గుర్తిస్తారని ఆశిస్తున్నాం..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో వస్తున్న 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల కానుండగా.. ప్రమోషన్స్‌లో జోరు పెంచారు చిత్ర బృందం. ఇందులో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్ చరణ్ తనపై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించాడు. 'ట్రోలింగ్స్‌పై నాకు ఎలాంటి అభిప్రాయం లేదు. నా కంట్రోల్‌లో లేని దాని గురించి నేనేం మాట్లాడగలను. అదుపు చేయలేని విషయాలపై నేను స్పందించను. ఒక్కటి మాత్రం చెప్పగలను. మేం తీసే సినిమా అందరికీ నచ్చాలని లేదు.. కానీ మా శ్రమను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. అంతే కాదు.. పెద్ది సినిమా నా కెరీర్ బెస్ట్ మూవీ అవుతుందనే నమ్మకం ఉంది' అంటూ ధీమా వ్యక్తం చేశాడు. ఇక ఈ సినిమా టికెట్ల ధరల విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పెద్ది' టికెట్ ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. విడుదలైన మొదటి వారం లేదా పది రోజులు అదనపు ధరలతో పాటు రోజుకు 5 ఆటలు ప్రదర్శించుకునేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 3వ తేదీ రాత్రి ప్రదర్శించే ప్రత్యేక ప్రీమియర్ షో టికెట్ ధరను GSTతో కలిపి రూ. 600గా నిర్ణయించారు. ఆ తర్వాత సాధారణ రోజుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై రూ. 100, అలాగే మల్టీప్లెక్స్‌లలో రూ. 125 చొప్పున అదనంగా పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే.. తెలంగాణలో మాత్రం 'పెద్ది' చిత్రానికి టికెట్ ధరల పెంపు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రేట్ల పెంపుదలపై కోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ ఆలస్యం అవుతుండటంతో ఈ సినిమా విడుదలకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. దీనివల్ల నైజాం ప్రాంతంలో ఈ సినిమా సాధారణ ప్రభుత్వ ధరలతోనే విడుదల కానున్నట్లుగా సమాచారం.

## జనాలు చాలా త్వరగా ఒక నిర్ణయానికి వచ్చేసి విమర్శించేస్తారు..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ వంటి స్టార్స్ కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ఈ సినిమా జూన్ 4న థియేటర్స్‌లోకి రాబోతుంది. అప్పడే ప్రమోషన్స్ జోరు పెంచిన మూవీ టీమ్ నిత్యం పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తాజాగా, జాన్వీ ఓ ఇంటర్వ్యూలో భాగంగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. "రామ్ చరణ్ సార్ చెప్పినట్లుగా.. ఒక సినిమాను పూర్తి నిజాయితీతో, కఠోర శ్రమతో, మంచి ఉద్దేశంతో రూపొందిస్తే, అది కచ్చితంగా చేరాల్సిన ప్రేక్షకులను చేరుతుందని నేను బలంగా నమ్ముతాను. ఈ రోజుల్లో జనాలు చాలా త్వరగా ఒక నిర్ణయానికి వచ్చేసి విమర్శిస్తుంటారని నాకు తెలుసు. కానీ అంతిమంగా చూస్తే సినిమా అనేది ఒక సేవ లాంటిది కదా? ప్రేక్షకులను చేరుకోవడానికి, వారికి థియేటర్లలో మంచి వినోదాన్ని పంచడానికే కదా మనం ఇంత కష్టపడి మూవీస్ తీస్తున్నది. కాబట్టి, ప్రేక్షకులు చిత్రం గురించి ఏమని భావిస్తున్నారు లేదా వారు ఎలాంటి విషయాలు మాట్లాడుకుంటున్నారు అనే అంశాలను మనం పూర్తిగా పట్టించుకోకుండా వదిలేయలేము. నా వ్యక్తిగత ఉద్దేశం ఏమిటంటే.. సినిమా రంగానికి ప్రేక్షకులే దైవంతో సమానం. మనం కేవలం వారి ఇష్టాలను, అవసరాలను గుర్తిస్తూ వారికి మంచి చిత్రాల ద్వారా సేవ చేయడానికి ప్రయత్నిస్తున్నామని నేను భావిస్తాను" అంటూ చెప్పుకొచ్చింది.




## ఎట్టకేలకు భరతనాట్యం వివాదంపై స్పందించిన అనన్య పాండే..

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్యా పాండే, యంగ్ హీరో లక్ష్య జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'చాంద్ మేరా దిల్'. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ తన ధర్మా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. ఇటీవల థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను తెచ్చుకుంది. అయితే, ఈ సినిమాలోని ఒక డ్యాన్స్ సీక్వెన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద వివాదంగా మారింది. ఈ సినిమాలో అనన్యా పాండే చేసిన భరతనాట్యం డ్యాన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ అవ్వడంతో.. ఆమె భరతనాట్య కళను అగౌరవపరిచేలా డ్యాన్స్ చేసిందంటూ నెటిజన్లు, రాజకీయ నాయకులు, కళాకారులు దారుణంగా విమర్శలు గుప్పించారు. అంతేకాదు, ఆమె హావ భావాలపై రకరకాల మీమ్స్ క్రియేట్ చేస్తూ సోషల్ మీడియాలో అమ్మడిని ట్రోల్ చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ వివాదం ముదురుతుండటంతో, ఇటీవల అనన్య తండ్రి చుంకీ పాండే స్పందించి తన కూతురికి మద్దతుగా నిలిచారు.

తాజాగా ఈ వివాదంపై స్వయంగా అనన్యా పాండే స్పందించింది. తనపై వస్తున్న నెగిటివిటీపై అనన్య మాట్లాడుతూ.. "నేను ఇకపై ఆ విషయాలను అస్సలు పట్టించుకోను. వాటి గురించి ఆలోచించి సతమతమవ్వడం ఎప్పుడో మానేశాను. ఇప్పుడు నేను ఆ ట్రోలింగ్స్ నుండి పూర్తిగా బయటపడిపోయాను. ఇండస్ట్రీలోకి వచ్చినప్పటి నుండి ఎన్నో ఏళ్లుగా నాపై ఇలాంటి విమర్శలు వస్తూనే ఉన్నాయి. నిరంతరం మనపై వచ్చే నెగిటివిటీని వింటూ కూర్చోవడం లేదా మనల్ని విమర్శించే ఇతరులను సరిదిద్దడానికి టైమ్ వేస్ట్ చేసుకోవడం కంటే.. ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మను తాము పరిశీలించుకోవడం మంచిది. మన చుట్టూ పాజిటివిటీని సృష్టించుకోవడానికి ప్రయత్నించడమే అందరికీ శ్రేయస్కరం" అంటూ ట్రోలర్స్‌కు గట్టి సమాధానం ఇచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. నెటిజన్లు మండిపడుతున్నారు. తప్పు చేసిందే కాకుండా క్షమాపణలు చెప్పకుండా.. తెలివిగా మాట్లాడి తప్పించుకోవాలనుకుంటుందని అంటున్నారు.



## విలన్ అంటే లావుగా, అసహ్యంగా ఉండాలని ఆ నిర్మాత అన్నాడు



జగపతి బాబు తాజాగా తాను హీరో నుంచి విలన్‌గా మారే సమయంలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. జగపతిబాబు మాట్లాడుతూ, "ఒక దశలో హీరోగా నా కెరీర్‌ను కొనసాగించడం కష్టంగా అనిపించింది. ఆ సమయంలో కొంతమంది నిర్మాతలు నాతో సినిమాలు చేయడానికి ముందుకు వచ్చినా, నేను వర్కౌట్ కాదని వారికి ముందే చెప్పేవాడిని. నిజానికి అప్పట్లో నా దగ్గర డబ్బులు కూడా లేవు. అయినప్పటికీ వాళ్లకు నష్టం కలగకూడదనే ఉద్దేశంతో హీరోగా సినిమా చేయనని చెప్పాను" అని అన్నారు. అలాగే, "ప్రవరాఖ్యుడు సినిమా సమయంలో కూడా ఇదే విషయం చెప్పాను. కానీ ఆ సినిమా చేయాల్సి వచ్చింది.

హీరోగా నా కెరీర్ ముగిసిందనుకున్న సమయంలో తర్వాత ఏం చేయాలనే ఆలోచన వచ్చింది. సీరియల్స్ చేస్తే రోజుకు రూ.5,000 వస్తాయనే ఆలోచన కూడా వచ్చింది. అదే సమయంలో విలన్ పాత్రలు చేస్తే బాగుంటుందని భావించాను. ఈ విషయంపై ఒకరోజు సురేష్ బాబు గారిని కలిసి మాట్లాడాను. అయితే ఆయన 'విలన్ అంటే లావుగా, అసహ్యంగా ఉండాలి' అని చెప్పారు. అలాంటి సమయంలోనే నాకు లెజెండ్ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ సినిమా ద్వారా మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత నా కెరీర్ మంచి దిశలో ముందుకు సాగింది" అని తెలిపారు. ఇక ప్రస్తుతం జగపతిబాబు, రామ్ చరణ్ హీరోగా రూపొందిన పెద్ది చిత్రంలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా జూన్ 4న విడుదల కానుంది.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.

# సమతామూర్తి కేంద్రంలో ఘనంగా శ్రీ సుదర్శన మహామంత్ర హోమం ప్రారంభం

- **లోకక్షేమం – విశ్వశాంతి కోసం 11 రోజుల మహాక్రతువు**
- **త్రిదండి చిన్న జీయర్ స్వామిజీ సాన్నిధ్యంలో తొలి రోజు వైభవంగా నిర్వహణ**



**రాజేంద్రనగర్, మే 30 డిడి 9 వార్త**

శ్రీరామనగరంలోని సమతామూర్తి కేంద్రంలో లోకక్షేమం,విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న శ్రీ సుదర్శన మహామంత్ర హోమం తొలి రోజు శనివారం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఆధ్యాత్మిక వాతావరణంలో శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఈ మహాక్రతువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా త్రిదండి చిన్న జీయర్ స్వామిజీ,అహోబిల రామానుజ జీయర్ స్వామిజీ, దేవనాథ రామానుజ జీయర్ స్వామిజీలు ప్రత్యేకంగా పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.స్వామీజీల దివ్య సాన్నిధ్యంలో వేద పండితులు యాగ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ప్రత్యేకంగా అలంకరించిన విశాల యాగశాలలో ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద వేదఘోషల నడుమ సుదర్శన మహామంత్ర పఠనంతో అగ్నిదేవునికి ఆహుతులు సమర్పించారు. పవిత్ర హోమధూమాలు, నిరంతర వేద మంత్రోచ్ఛారణలతో సమతామూర్తి కేంద్రం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.మొదటి రోజు ఈ పవిత్ర హోమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామీజీల ఆశీర్వాదాలు పొందారు. మొత్తం 11 రోజుల పాటు ఈ మహాయాగం కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
భక్తుల రద్దీతో సమతామూర్తి కేంద్రం ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మోగింది.

# ముష్కిన్ చెరువు కబ్జాలకు హైడ్రా చెక్

- **రూ.5,500 కోట్ల విలువైన భూమికి రక్షణగా ఫెన్సింగ్**
- **పుప్పలగూడ–నార్సింగి పరిధిలో చెరువు హద్దుల నిర్ధారణ,ఆక్రమణల తొలగింపు**



**రాజేంద్రనగర్,మే 30 డిడి 9 వార్త**

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పలగూడ -నార్సింగి గ్రామాల పరిధిలోని ముష్కిన్ చెరువు ఆక్రమణలపై హైడ్రా శనివారం భారీ ఆపరేషన్ చేపట్టింది. చెరువు పరిరక్షణలో భాగంగా ఆక్రమణలను తొలగిస్తూ, మొత్తం చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే చర్యలు ప్రారంభించింది.హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 52.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు భూమి విలువ సుమారు రూ.5,500 కోట్లుగా అంచనా వేస్తున్నారు. చెరువు మధ్యలో కట్ట నిర్మించి 34.21 ఎకరాలను ఆక్రమించే ప్రయత్నం జరిగినట్లు అధికారులు గుర్తించారు. చెరువు అభివృద్ధి పేరుతో సీఎస్ఆర్ నిధులతో కొన్ని నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ,అవి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు హైడ్రా అధికారులు పేర్కొన్నారు.చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు చేపట్టరాదని స్పష్టం చేశారు.
గ్రామ రికార్డుల ప్రకారం చెరువు మొత్తం విస్తీర్ణం 59.11 ఎకరాలు కాగా,అందులో 20.23 ఎకరాలు ప్రభుత్వ శిఖం భూమిగా నమోదై ఉంది.మిగిలిన భూమి ఎక్సైజ్ పట్టా భూమిగా ఉన్నప్పటికీ,చెరువు హద్దులను ఆక్రమించే హక్కు ఎవరికీ లేదని అధికారులు వెల్లడించారు. పేదల పేరుతో గుడిసెలు ఏర్పాటు చేసి భూమిని ఆక్రమించేందుకు రియల్టర్లు ప్రయత్నించినట్లు గుర్తించిన హైడ్రా,గత రెండు నెలలుగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చింది. తగినంత సమయం ఇవ్వడంతో గుడిసెవాసులు స్వచ్ఛందంగా ఖాళీ చేసినట్లు అధికారులు తెలిపారు.
శనివారం చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ వేయడంతో పాటు,చెరువు మధ్యలో నిర్మించిన కట్టను తొలగించే పనులు చేపట్టారు. మొత్తం చెరువుతో పాటు మిగిలిన ప్రభుత్వ భూమిని కూడా పరిరక్షించేందుకు హైడ్రా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని అధికారులు వెల్లడించారు.



## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్..

**మణుగూరు.మే 30 (డి డి 9వార్త)**

పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐ, ఏఆర్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ లను ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు.42 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి పదవీ విరమణ పొందిన ఎస్సై కసిబోయిన సత్యనారాయణ రాజు,37 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి పదవీ విరమణ పొందిన ఏఎస్సై జంపాల హనుమంతరావు, 41 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి ప్రస్తుతం పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ ధారావత్ వెంకటేశ్వర్లు. 36 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి ప్రస్తుతం అశ్వాపురం నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ ఎట్టా శ్రీనివాసరావు లు శనివారం నాడు పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ నలుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో మరియు పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది. పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు, వారి కుటుంబ సభ్యులు కూడా వారి యొక్క అనుభవాలను పంచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఎంటిఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణ మరియు జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.




## అమ్మ మాట,– అంగన్వాడి బాటతో చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది

**గోవిందరావుపేట, మే 30 (డిడి9 వార్త)**

పసర సెక్టార్ పరిధిలోని పాపయ్యపల్లి గ్రామంలో "అమ్మ మాట - అంగన్వాడి బాట" కార్యక్రమాన్ని శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని, మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ప్రీప్రైమరీ విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు తెలుగుతో పాటు ఇంగ్లీష్ భాషలోనూ ప్రాథమిక పరిజ్ఞానం అందిస్తూ, వారి శారీరక, మానసిక, మేధో, సామాజిక మరియు భాషా వికాసానికి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు.ఆటలు, పాటలు, కథలు వంటి సృజనాత్మక బోధనా విధానాల ద్వారా పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, మూడు సంవత్సరాలు నిండిన చిన్నారుల ఇళ్లను సందర్శిస్తూ అంగన్వాడీ కేంద్రాల్లో చేరికల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఆర్. శారద, అంగన్వాడీ టీచర్ వనిత బాయి, ఆయా కమల, సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల విద్యాభివృద్ధి, సమగ్ర వికాసం పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన మరింత పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.



## బాలవికాస ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి స్థానిక కమిటీల ఏర్పాటు

**గోవిందరావుపేట, మే 30 (డిడి 9 వార్త)**

లక్ష్మీపురం గ్రామపంచాయతీలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కమిటీల ఏర్పాటు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రోగ్రామ్ మేనేజర్ మంజుల రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్వయంప్రతిపత్తి, ప్రజల భాగస్వామ్య అభివృద్ధికి ఈ కమిటీలు కీలకంగా పనిచేస్తాయని అన్నారు. విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, వ్యవసాయం, మహిళా సాధికారత, యువత అభివృద్ధి, సమస్యల పరిష్కారం తదితర రంగాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, వాటి ప్రతినిధులతో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ మహిళలకు కమిటీలలో ప్రాధాన్యత కల్పించడం సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం కమిటీల పనితీరును నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి దోహదపడే ఈ కార్యక్రమం ఆదర్శ గ్రామ నిర్మాణ దిశగా ఒక మైలురాయిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లకవత్ జిమ్మిలాల్, బాలవికాస ప్రోగ్రామ్ మేనేజర్ మంజుల రెడ్డి, సీనియర్ కోఆర్డినేటర్ వసంత, కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, డెవలప్‌మెంట్ ఏజెంట్లు వినయ్ కుమార్, శంకర్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ బదిలీ

- **మధిర నూతన కమిషనర్ గా గ్రూప్ 1 అధికారికి బాధ్యతలు**



**బోనకల్,మే 30,(డీడీ9 వార్త) :**

మధిర మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్ కుమార్ మల్కాజిగిరి ప్రాంతానికి బదిలీ అయినట్లు సమాచారం. ఆయన పదవీకాలంలో పట్టణ అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. బదిలీ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## నీటి సరఫరా వివాదం - డ్రైవర్‌పై దాడి

- **రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్ల ఫిర్యాదు**
- **దాడిచేసి వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **తమకు న్యాయం చేయాలని కోరిన డ్రైవర్లు**



**రాజేంద్రనగర్, మే 30 డిడి 9 వార్త**

మణికొండ మున్సిపల్ పరిధిలో జలమండలి వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది.స్థానికంగా నీటి సరఫరా విషయంలో తలెత్తిన వివాదం డ్రైవర్‌పై దాడికి దారితీసినట్లు సమాచారం. చెప్పిన ప్రాంతంలో నీటి సరఫరా చేయలేదని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులు ట్యాంకర్ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆగ్రహంతో డ్రైవర్‌పై దాడి చేయడంతో ముక్కు నుంచి తీవ్ర రక్త స్రావం అయ్యింది. గాయపడిన డ్రైవర్‌కు పక్కనే ఉన్న ఓ ఆసుపత్రిలో చికిత్స అందించారు.ఈ ఘటనపై బాధిత డ్రైవర్లు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని,తమపై జరిగిన దాడికి బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డ్రైవర్లు పోలీసులను కోరినట్లు సమాచారం. విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇలాంటి దాడులు జరగడం ఆందోళనకరమని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.


## బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా తప్పదు

- **చెత్త కుప్పల తొలగింపు చలివేంద్రాల ఏర్పాటు**




**రాజేంద్రనగర్ మే 30 డిడి 9 వార్త**

నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో చెత్త నిర్వహణపై జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టి. కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సానిటెషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం ఆధ్వర్యంలో గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.
గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి ఆ ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచారు.అదే ప్రాంతాల్లో మంచిరేవుల మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి సహకారంతో ప్రజల కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.వేసవి దృష్ట్యా గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.
ఇకపై నిర్దేశిత ప్రాంతాలు కాకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. గ్రామస్తులు,అద్దెదారులు తమ చెత్తను సంబంధిత చెత్త సేకరణ ఆటోలకు మాత్రమే అందించాలని విజ్ఞప్తి చేశారు.



## మండపాక జాతీయ రహదారి–163పై వాహనాల తనిఖీలు

**వాజేడు మే 30 (డిడి9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక వద్ద జాతీయ రహదారి-163పై వాజేడు పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాజేడు ఏఎస్ఐ యాకూబ్ పాషా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో అనుమానాస్పద వాహనాలు, అక్రమ రవాణా, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు.
వాహనాల డిక్కీలు పరిశీలించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇతర అవసరమైన డాక్యుమెంట్లను తనిఖీ చేశారు. ప్రజలు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.



## ఐఎఫ్‌టీయూలో చేరిన ఆర్జీ3 ప్రైవేట్ సెక్యూరిటీ కార్మికులు

- **కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం: ఆకుల వెంకన్న**

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

ఆర్జీ3 పరిధిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ లో సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.
కార్మికుల సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యమని, హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి సభ్యుడు భాగస్వామి కావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఎం. రమేష్, వి. కుమారస్వామి, ఎల్. వినోద్, ఏ. సంజీవ్, జి. రవి, కె. ప్రభాకర్, ఏ. సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు.. పేదలకు పండ్ల పంపిణీ

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 57వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ3 పరిధిలోని సెంటర్ లేబర్ అడ్డ వద్ద ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో పేదలకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మబ్బు శంకర్ నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజాసేవలో నిరంతరం ముందుండే శ్రీధర్ బాబు మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ జనరల్ సెక్రటరీ బండ కిరణ్ రెడ్డి, సెంట్రల్ సెక్రటరీ ఉడుత శంకర్ యాదవ్, బ్రాంచ్ సెక్రటరీ మల్లారెడ్డి, సెక్యూరిటీ ఇన్‌చార్జి శ్రీరాములు కుమార్, మహిళా నాయకురాలు జాగరి రజిత యాదవ్, ఉడుత అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## పెట్రోల్–డీజిల్ ధరల పెంపుపై సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నిరసన

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి అంబేద్కర్ చౌరస్తా, గోదావరిఖని ఎన్‌టీపీసీ సెంటర్, 8వ కాలనీ షిర్కే బస్టాండ్ కూడలి వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

**ధరల పెంపుతో పేదలపై భారం**

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ..., కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో ఇంధన ధరలు తగ్గకపోవడం అన్యాయమన్నారు.

**ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి**

నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవనం కష్టతరంగా మారిందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, భూసనవేణి కృష్ణ, ఈసంపల్లి రాజేందర్, మార్త రాములు తదితరులు పాల్గొన్నారు.



## పద్మావతి కాలనీలో రోడ్డు కబ్జా యత్నం..!!

- ప్రజా మార్గంపై సిమెంట్ పోల్స్... నివాసుల ఆందోళన
- రోడ్డు ప్రజలదా..? వ్యక్తులదా..? అంటూ కాలనీవాసుల ప్రశ్న
- ప్రజల రాకపోకలకు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ ఆరోపణలు

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

రామగుండం నగరపాలక సంస్థ 49వ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో శనివారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల కథనం ప్రకారం, ఈరోజు (30052026) సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో గాజుల కిరణ్‌తో పాటు దాదాపు 10 మంది అనుచరులు కాలనీకి వచ్చి ప్రజలు నిత్యం వినియోగిస్తున్న రహదారిని కబ్జా చేసేందుకు ప్రయత్నించినారు.

స్థానికులు తెలిపిన వివరాల మేరకు, రహదారికి ఇరువైపులా సిమెంట్ పోల్స్ పాతి, మార్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనతో కాలనీవాసులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలందరూ వినియోగిస్తున్న రహదారిపై ఇలాంటి చర్యలు చేపట్టడం బాధాకరమని, ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నాలను అధికారులు అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

"రోడ్లు ప్రజల సౌకర్యం కోసం నిర్మించబడతాయి. కానీ కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజా మార్గాలను ఆక్రమించుకునే ప్రయత్నాలు జరగడం విచారకరం" అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ఈ మార్గాన్ని ఉపయోగిస్తారని, రహదారి సంకుచితమైతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

ప్రజా రహదారుల పరిరక్షణ బాధ్యత అధికారులపై ఉందని, వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాలనీలో శాంతి భద్రతలు, ప్రజల హక్కులు కాపాడేందుకు సంబంధిత శాఖలు స్పందించాలని కోరుతున్నారు.

ఈ ఘటన ప్రస్తుతం పద్మావతి కాలనీలో చర్చనీయాంశంగా మారగా, ప్రజా స్థలాల పరిరక్షణపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.







## మల్లయిగూడెంలో కాంగ్రెస్ నాయకుడి బరితెగింపు...

- రాజకీయ కక్షతో రాత్రికి రాత్రే పామ్ ఆయిల్ తోటలో మొక్కలను నరికి వేసిన అరాచక శక్తులు..

**అశ్వరావుపేట:మే 30 (డిడి 9 వార్త)**

అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. అశ్వారావుపేట మండలం మల్లయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్ కి తనకున్న 5 ఎకరాల పట్టా భూమిలో పామాయిల్ మొక్కలు నాటగా, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మొక్కలను దారుణంగా రాత్రికి రాత్రే నరికివేసి విధ్వంసం సృష్టించాడు. రాజకీయ కక్షతోనే కష్టపడి పెంచుకుంటున్న తోటను నాశనం చేయడం పట్ల స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న *అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు *అశ్వారావుపేట నాయకులతో కలిసి మల్లయిగూడెం చేరుకుని, నరికివేసిన పామాయిల్ తోటను పరిశీలించారు. బాధితుడు నారం రాజశేఖర్ కు పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకుల తీరుపై వారు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజలు ఓట్లు వేసి రాజకీయంగా గెలిపించింది పనులు చేయడానికి తప్ప, ఇలాంటి విధ్వంసాలు సృష్టించడానికి కాదని..ఎవరూ ఇక్కడ శాశ్వతంగా అధికారంలో ఉండరు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి అని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడు ఇలాంటి విధ్వంసాలు లేవని ప్రశాంతంగా నియోజకవర్గం ఉండేదని కాంగ్రెస్ గెలిచిన రోజు నుంచి ఎక్కడ చూసినా దాడులకు పాల్పడుతున్నారని.ఈ దౌర్జన్యాలకు దాడులకు పాల్పడుతున్న వారికి భవిష్యత్తులో గట్టి సమాధానం చెప్తామని.వెంటనే పంటను నాశనం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేని యడల ధర్నాకు సిద్ధమవుతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ZPTC జూపల్లి రమణారావు ,మోహన్ రెడ్డి ,సంక ప్రసాద్ ,మాజీ ZPTC సున్నం నాగమణి ,కిషోర్ ,ఈదర రాంబాబు ,చందా కుమార స్వామి ,దుర్గ రావు ,రాజా రావు ,శివకాంత్ ,అనిల్ ,హేమంత్ ,నరసింహారావు ,సుధాకర్ ,సున్నం కృష్ణ ,సంజయ్ ,వెంకన్న బాబు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు .

## అగ్ని బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

- తక్షణ ఆర్థిక సహాయం అందజేసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు హామీ..

**మణుగూరు.మే 30 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం పాండురంగాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పలగుంపు గ్రామంలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం నాడు ప్రత్యక్షంగా సందర్శించి పరామర్శించారు.

గ్రామానికి చెందిన గొగ్గెల అబ్బయ్య మరియు కొమరం రాంబాబు కుటుంబాల నివాస గృహాలు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై పూర్తిగా దగ్ధమవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెబుతూ,ప్రభుత్వం మరియు తాను అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అగ్నిప్రమాదంలో ఇళ్లు, గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన సొంత నిధుల నుండి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నూతన గృహాలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు.ప్రమాద ఘటనపై ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి అపద్బంధు లేదా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన అన్ని రకాల ఆర్థిక సహాయాన్ని త్వరితగతిన బాధితులకు అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. "ప్రమాదవశాత్తు ఇళ్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా నిలిచి వారి జీవితాలు తిరిగి గాడిలో పడేలా కృషి చేస్తాం" అని అన్నారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయండి

**గోవిందరావుపేట, మే 30 (డి డి 9 వార్త)**

ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ( నేడు) నిర్వహించనున్న జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. వెంకటకృష్ణ మాట్లాడుతూ ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు ఈ సమావేశం జరగనుంది.

ఈ సమావేశానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొననున్నట్లు తెలిపారు.

జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలకు సంబంధించిన కీలక అంశాలు సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.





## అశ్వారావుపేటలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- జూన్ 2 నాటికి ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి - జిల్లా కలెక్టర్ అంకిత్

**అశ్వరావుపేట:మే 30(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు, తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల నాణ్యత, పురోగతి, భవనాల నమూనా మ్యాపులను పరిశీలించారు. విద్యార్థులకు భవిష్యత్తులో అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించేలా అన్ని ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాల ప్రాంగణానికి అనుసంధాన రహదారులు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి విద్యను అందించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే లక్ష్యంతో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి, సాదా బైనామా, భూ సర్వేలకు సంబంధించిన దరఖాస్తులు, వాటి పరిష్కార పురోగతిని తహసీల్దార్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించి సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు.అలాగే అశ్వారావుపేట మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలు, ఫిర్యాదులను తెలుసుకున్నారు. ప్రజల వినతులను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు . అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అశ్వారావుపేట మండలంలో మొత్తం 957 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 926 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 123 ఇండ్లు బేస్ లెవల్‌లో, 189 ఇండ్లు రూఫ్ లెవల్‌లో, 403 ఇండ్లలో స్లాబ్ పనులు పూర్తికాగా, 200 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 31 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 136 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 129 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమై, 52 ఇండ్లు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పూర్తయిన మరియు చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జూన్ 2వ తేదీన గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందిస్తూ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న విద్యా, గృహ నిర్మాణ, రెవెన్యూ సేవల కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కిషోర్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ మదన్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# బుద్వేల్ రహదారికి 'మోక్షం' ఎప్పుడు?

- అడుగుకో గుంత - నిత్య నరకప్రాయంగా ప్రయాణం
- రోడ్డు విస్తరణపై అధికారుల నిర్లక్ష్యం

**రాజేంద్రనగర్,మే 30 డిడి 9 వార్త**

రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ గ్రామంలో రహదారి సమస్యలు రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. అడుగుకో గుంతతో వాహన దారులు,స్థానిక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.గతంలో కౌన్సిలర్ కాలంలో వేసిన ఈ రోడ్డును ప్రస్తుతం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు.పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డు విస్తరణ చేపట్టడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.ముఖ్యంగా వాటర్ ఫిల్టర్ బెడ్ నుంచి కిష్టమ్మగుట్ట వరకు,అలాగే బుద్వేల్ ఎక్స్టెన్షన్ చౌరస్తా నుంచి కిష్టమ్మగుట్ట వరకు రహదారి అత్యంత సన్నగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది.ఇక బుధవారం, శనివారం వారంతపు సంతల రోజుల్లో అయితే పరిస్థితి మరీ ఘోరంగా మారుతోంది. ఉదయం,సాయంత్రం వేళల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతుండటంతో ప్రజల సమయం వృథా అవ్వడమే కాకుండా, ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి.రోజు రోజుకు వాహనాలు పెరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాక స్పందిస్తారా.?అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

**బండారి బాలకృష్ణ:**
కౌన్సిలర్ కాలంలో వేసిన రోడ్లు ఇవి.ఇప్పటివరకు ఈ రోడ్లకు కనీస మరమ్మతులు లేవు.రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుంటే,రోడ్డు మాత్రం ఇరుగ్గా మారిపోయాయి.గుంతల వల్ల ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చోట రోడ్డు వెడల్పు చేసి,మిగతా రోడ్లు వేయాలి.
బీజేపీ నేత బండారి బాలకృష్ణ
ఎక్స్టెన్షన్ చౌరస్తా నుండి కిష్టమ్మగుట్ట వరకు రోడ్డు ఇరుకుగా ఉంది.ఈ దారి గుండా భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. ట్రాఫిక్ జామ్ నరకం చూపిస్తోంది. అత్యవసరంగా హాస్పిటల్‌కు వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి,శాశ్వత పరిష్కారంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.
స్థానిక వాసి గుంటి బలరాం

**త్వరలోనే పనులు ప్రారంభిస్తాం**
ఈ సమస్యపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సూపరింటెండింగ్) నరేందర్ మాట్లాడుతూ.. స్పష్టమైన హామీ ఇచ్చారు. ధోభీ ఘాట్ నుండి గ్రీన్ సిటీ వరకు చేపట్టనున్న రోడ్డు పనుల నిమిత్తం రూ.1.32 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. రాబోయే సోమవారం నుంచే ఈ పనులను ప్రారంభించి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని వెల్లడించారు. అలాగే ప్రభుత్వ పాఠశాల పక్క నుండి ప్యాట్ల,అరుంధతి సంక్షేమ సంఘం మీదుగా కిస్మత్ పూర్ కలిసే రోడ్డు వరకు నిధుల కోసం ఎస్టిమేషన్(అంచనాలు) సిద్ధం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,త్వరలోనే నిధులు మంజూరు చేయించి ఆ రోడ్డు పనులు కూడా త్వరితగతిన మొదలుపెడతామని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- జూన్ 1 నుంచి రెండో విడతలో నియోజకవర్గానికి అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు..

**మణుగూరు.మే 30 (డి డి 9వార్త)**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల తహసీల్దార్లు (ఎంఆర్వోలు),ఎంపీడీవోలు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మొదటి విడత ఇళ్ల నిర్మాణాల ప్రగతి, లబ్ధిదారుల వివరాలు, నిధుల విడుదల ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ నిర్ణయం మేరకు జూన్ 1వ తేదీ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభం కానుందని, పినపాక నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, స్థలం లేని వారికి స్థలంతో పాటు గృహ నిర్మాణ నిధులు కూడా ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేయడంతో నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయని, ఇప్పటికే అనేక మంది లబ్ధిదారులు తమ సొంత గృహాల్లో గృహప్రవేశాలు చేసుకుంటుండటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పేద ప్రజలు సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటూ సంతోషంగా గృహప్రవేశాలు జరుపుకోవడం తనకు ఎంతో తృప్తినిస్తోందన్నారు.అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణాల పురోగతిని జియో ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ,నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేగంగా జమ అయ్యేలా చూడాలని సూచించారు. గిరిజనులు, నిరుపేదలు, అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల మెరుపు దాడి..

- 3.5 కిలోల గంజాయి స్వాధీనం..
- గంజాయి ముఠాపై వెంకటాపురం పోలీసుల ఉక్కుపాదం..
- భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా వెంకటాపురంలో పట్టివేత..
- ఐదుగురి అరెస్ట్.. ఒకరు పరారీ..

**వెంకటాపురం, మే 30 (డిడి 9 వార్త):**



వెంకటాపురం పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాచలం వైపు నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారని తెలిసి, ఎస్ఐ తిరుపతిరావు తన సిబ్బంది, క్లూస్ టీం మరియు పంచులతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.
శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య వెంకటాపురం దాటిన అనంతరం వాజేడు మార్గంలోని కంకాలవాగు సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చర్ల వైపు నుంచి వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు అనుమానాస్పదంగా కనిపించడంతో వాటిని ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక స్కూటీపై వెనుక కూర్చున్న వ్యక్తి పోలీసులను గమనించి సమీపంలోని పామాయిల్ తోటలోకి పారిపోయాడు.
అప్రమత్తమైన పోలీసులు మొదటి స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులను, వెనుక వచ్చిన పల్సర్ మోటార్‌సైకిల్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారి వద్ద నిషేధిత గంజాయి ఉన్నట్లు అంగీకరించారు. అనంతరం పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, వారి వద్ద నుంచి 3.5 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు మరియు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1,75,050గా అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెంకటాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి సేవించడం, నిల్వ చేయడం, కొనుగోలు చేయడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు.

**అరెస్టయిన నిందితులు:**
* వంగ భరత్ సాయి (24), మైలారం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా.
* బొడ్డు నితిన్ (24), కొత్తవాడ, ఆటోనగర్, వరంగల్.
* ఎల్లబోయిన సన్నీ (22), కొత్తవాడ, ఆటోనగర్, వరంగల్.
* పొట్లూరి వేధపాణి @ సంతోష్ (19), చల్వాయి గ్రామం, గోవిందరావుపేట మండలం, ములుగు జిల్లా.
* కొండగొర్ల కొమురయ్య (23), ఉప్పేడు వీరాపురం గ్రామం, వెంకటాపురం మండలం, ములుగు జిల్లా.

పరారీలో ఉన్న నిందితుడు: సచిన్ ఆర్యన్, లింగంపల్లి, హైదరాబాద్.
పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# బాల్క సుమన్ అరెస్టు కక్షసాధింపు రాజకీయాలే: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ,మే 30 (డిడి 9 వార్త)బ్యూరో**



బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతూ ప్రశ్నించే గొంతుకలను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.
సింగరేణిలో జరుగుతున్న అవినీతి, కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రశ్నించినందుకే బాల్క సుమన్‌ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల్లో ఆత్మవిశ్వాసం నింపే ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు కావాలనే వక్రీకరించి నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయించారని విమర్శించారు.
కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు బహిరంగంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. ప్రతిపక్ష నేతలపై మాత్రమే కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.
ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నాయకులను అక్రమంగా జైలుకు పంపించే ప్రయత్నం చేస్తోందని, నిరసన తెలిపే హక్కును కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్క సుమన్‌పై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, ఆయనను తక్షణమే విడుదల చేయాలని డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.



## ఓసి ఫోర్ దుర్గ కంపెనీ మేనేజ్మెంట్ తీసివేసిన ఐదుగురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి..

- మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్..
- మణుగూరు సింగరేణి GM ను కలిసిన అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు.

**మణుగూరు.మే 30 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి.
మణుగూరు ఓసి ఫోర్ లో ఓబీ పనులు నిర్వహిస్తున్న దుర్గ కంపెనీ మేనేజ్మెంట్ తీసివేసిన ఐదుగురు కార్మికులను వెంటనే వీధిలోకి తీసుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సింగరేణి జిఎం గారిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వై. రాంగోపాల్(AITUC), పి. వీరభద్రం (INTUC), ఊకంటి. ప్రభాకర్(TBGKS), జి. శ్రీను(CITU), ఆర్. మధుసూదన్ రెడ్డి (TUCI), ఆంగోత్. మంగీలాల్(IFTU), అమీనుద్దీన్ (TNTUC) లు మాట్లాడుతూ.. మా వేతనాలు సకాలంలో చెల్లించమన్నందుకు కార్మికులను టార్గెట్ చేసి విధుల నుండి తొలగించడం అన్యాయం అన్నారు. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయి, పొల్యూషన్ భారిన పడుతూ ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతుంటే స్థానికులకు ఉపాధి కల్పించవలసిన ప్రైవేట్ కంపెనీలు స్థానికేతరులను తీసుకొని స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. జీతాలు సకాలంలో చెల్లించమని అడిగితే కార్మికులను అక్రమంగా తొలగిస్తూ మేనేజ్మెంట్ నియంతలాగా వ్యవహరిస్తుందన్నారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలన్నారు. ఈ విషయం స్థానిక సింగరేణి జిఎం గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, స్థానికులకు 80% ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు అన్నారు.
ఈ కార్యక్రమంలో గడ్డం. వెంకటేశ్వర్లు, సురేందర్,రాంబాబు, అమీనుద్దీన్, వరదల సమ్మయ్య అప్పారావు,సార బాబు, లింగరాజు, ఎండి మున్వారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన పోలీస్ అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..., 2025కు ముందు నమోదై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు, అరెస్టులు, సాక్ష్యాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రాపర్టీ, బాడీలీ అఫెన్స్ కేసులను చట్టబద్ధంగా, పారదర్శకంగా విచారించాలని ఆదేశించారు.
ఆర్థిక నేరాలకు పాల్పడిన వారి ఆస్తులను చట్టప్రకారం జప్తు చేసే చర్యలు తీసుకోవాలని సూచించిన సీపీ, కిడ్నాపింగ్, మిస్సింగ్ కేసుల్లో బాధితులను గుర్తించడంలో ఆలస్యం జరగరాదన్నారు. సైబర్ క్రైమ్, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అక్రమ ఇసుక రవాణా, గుడుంబా తయారీ, పేకాట, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టి కన్విక్షన్ శాతం పెంచాలని సూచించారు.ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులను సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



## పిట్ ఇంజనీర్ రాందాస్‌కు ఘన వీడ్కోలు

- పదవీ విరమణ సందర్భంగా ఏఐటియుసి సన్మానం

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

సింగరేణి రామగుండం1 ఏరియాలోని జీడీకే 11వ ఇంక్లైన్‌లో పిట్ ఇంజనీర్‌గా సేవలందించిన శ్రీ రాందాస్ శనివారం పదవీ విరమణ పొందిన సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను రాందాస్ దంపతులను పూల బొకేలు అందజేసి, శాలువాలతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.
రాందాస్ తన ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి అందరి ప్రశంసలు పొందారని నాయకులు కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో గని అధికారులు, ఏఐటియుసి నాయకులు సిద్దమల్ల రాజు, నాయిని శంకర్, గొడిశల నరేష్, జాన్ కెనడీ, జక్కుల శ్రీనివాస్, వెంకటేష్, మల్లయ్య, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొని రాందాస్ సేవలను అభినందించారు.



## సేవలకు ఘన సత్కారం.. ఇద్దరు ఉద్యోగులకు వీడ్కోలు

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

రామగుండం ఏరియా 1 జీఎం కార్యాలయం లో విధులు నిర్వహించిన స్పోర్ట్స్ సూపర్‌వైజర్ హనుమాన్ దాస్ రమేష్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఇందూరి సత్యనారాయణ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్.ఓ. టు జీఎం చంద్రశేఖర్ పూల మాలలు, శాలువాలతో వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..., ఇద్దరు ఉద్యోగులు తమ సేవా కాలంలో క్రమశిక్షణ, నిబద్ధత, స్నేహపూర్వక వైఖరితో అందరి గౌరవాన్ని సంపాదించుకున్నారని అన్నారు. పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో సహజమైన ఘట్టమని పేర్కొంటూ, వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయ్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, సీఎంఓఐ ప్రతినిధి క్రాంతికుమార్, మోహన్‌రావు, నాగుల వేణు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు శ్రావణ్ కుమార్, హనుమంతరావు తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## మైనింగ్ స్టాఫ్ సమస్యలపై ఏఐటియుసి ఫోకస్

- **జూన్ స్ట్రక్చర్ సమావేశాల్లో పరిష్కారానికి కృషి : వాసిరెడ్డి సీతారామయ్య**

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూన్‌లో యాజమాన్యంతో జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో ఏఐటియుసి సమర్థంగా పోరాడుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన రామగుండం రీజియన్ మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్ స్టాఫ్ అభిప్రాయాలను సేకరించి, వాటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని చెప్పారు.201617 బ్యాచ్‌కు చెందిన మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ల అంశాన్ని జూన్ సమావేశాల్లో ప్రధానంగా ప్రస్తావిస్తామని తెలిపారు. గత పదేళ్లుగా ప్రమోషన్లు లేకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొందన్నారు. పని భారం, ఇంక్రిమెంట్ల అంశాలపై చర్చ పని భారం, క్రమశిక్షణ చర్యల కారణంగా నిలిచిపోయిన ఇంక్రిమెంట్లు తదితర సమస్యలపై కూడా యాజమాన్యంతో చర్చించి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి.రావు, నాయకులు రంగు శ్రీను, గందం సాంబశివరావు, పల్లె క్రాంతికుమార్, ఎస్.వెంకట్‌రెడ్డి, వినయ్, పెర్క మహేందర్, పి.రవి తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధుల సంక్షేమానికి బోనకల్‌లో ప్రత్యేక వసతి వేదిక కోరకు ముందడుగు

**బోనకల్,మే 30,(డీడీ9 వార్త):**

సమాజానికి జీవితాంతం సేవలందించిన వృద్ధులు ప్రశాంతంగా కాలక్షేపం చేయడంతో పాటు పరస్పరం కలుసుకుని తమ అనుభవాలను పంచుకునేందుకు బోనకల్ మండల కేంద్రంలో ప్రత్యేక వృద్ధుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముమ్మర చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా బోనకల్‌లోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఒక గదిని వృద్ధుల కోసం కేటాయించే అవకాశాలను బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి,ఉప సర్పంచ్ కొండ,అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ ఒకేచోట సమావేశమై స్నేహపూర్వక వాతావరణంలో సమయం గడపడం,ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం,సామాజిక అంశాలపై చర్చించుకోవడం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు. ఇందుకోసం అనువైన స్థలంగా జలవనరుల శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న గదిని పరిశీలించి,దానిని అధికారికంగా కేటాయించేందుకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో కలిసి చర్చిస్తున్నామన్నారు.అలాగే వృద్ధులు కుటుంబం మరియు సమాజానికి మార్గదర్శకులని, వారికి ప్రత్యేక వేదిక కల్పించడం ద్వారా వారి అనుభవాలు యువతకు ఉపయోగపడటంతో పాటు వృద్ధులలో ఒంటరితనాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ గది పరిశీలన కార్యక్రమంలో ఏసీడీపీవో షకీరా బేగం,పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రమాదేవి పాల్గొన్నారు. మరియు బోనకల్ గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు,తెల్లూరి రమేష్,గూగులోత్ నాగేశ్వర్ రావు, యార్లగడ్డ శ్రీను,గుంగుల పుల్లయ్య,వి. నరసింహారావు, మల్లెల వేలాద్రి,మరీదు శేషు ,నారపోగు టైగర్ తదితరులు హాజరయ్యారు.

# అక్రమ వసూళ్లను అరికట్టండి

- **టిజి ఎండిసి ఎండి కి ఫిర్యాదు**

**భూపాలపల్లి మే 30 ( డిడి 9 వార్త )**

రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇసుక రీచుల్లో స్టాక్ యార్డ్ గుత్తేదారులు లారీల యజమానుల నుంచి వివిధ కారణాలు చూపుతూ సుమారుగా రెండు వేల వరకు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు పెద్ద అంబరపేట లారీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపాడు.

ఇసుక ర్యాంప్ లలో కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని,అట్టి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అలాగే అక్రమ లోడింగ్ డబ్బుల వసూలు తక్షణమే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఇసుక లారీ టిజి ఎండిసి సంస్థ ద్వారా డీడీ 15,650/ ఒక్కో లారీకి ఆన్ లైన్ లో చెల్లించి లోడింగ్ వెళ్లిన ఇసుక లారీల దగ్గర కాంట్రాక్టర్లు బెదిరిస్తూ భయపెడుతూ అందినకాడికి లోడింగ్ పేరుతో అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. సంస్థ ద్వారా స్టాక్ యార్డ్ వారికి సుమారుగా 3500 నుండి 4000 రూపాయలు వస్తున్నాయని,అవి కాకుండా ఒక్కొక్క ఇసుక లారీ దగ్గర 2000 రూపాయల నుండి 2500 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక్కొక్క లారీ దగ్గర రెండు వైపులా వసూలు చేస్తున్నారని, ఈ అక్రమ డబ్బుల వసూలు వల్ల ప్రభుత్వ ఆదాయానికి కూడా పెద్ద ఎత్తున గండి కొడుతున్నారని అన్నాడు. మరీ ముఖ్యంగా కరీంనగర్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, తదితర జిల్లాల్లో ఈ అక్రమ వసూళ్లకు అడ్డు, అదుపు లేదని ఆయన అన్నారు. పోతిరేడ్డి పల్లి, కొండపాక, కొరకల్, ఉటూర్, మల్లారెడ్డి పల్లి ఇసుక ర్యాంప్ లలో కాంట్రాక్టర్ల ఒక్కొక్క లారీ దగ్గర లోడింగ్ పేరుతో 2100 రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో లోడింగ్ పేరుతో 1700 రూపాయలు, కాంట పేరుతో 500 రూపాయలు, జేసీబీ ఆపరేటర్ కి 200 రూపాయలు వసూలు చేస్తున్నారని, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పివో కాంట్రాక్టర్ల తో మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వహిస్తూ, కాంట్రాక్టర్లు అందినకాడికి వసూలు చేసుకునేవిధంగా సహకరిస్తున్నాడని ఆరోపించాడు. ఈ జిల్లాలో కొన్ని ఇసుక ర్యాంప్ లలో ఓవర్లోడ్ కూడా చేస్తున్నారని ని, ఓవర్లోడ్ విషయం పివో దృష్టికి తీసుకుని వెళితే వెంటనే అతను విచారణ చేయకుండా కాంట్రాక్టర్లకు సమాచారం అందించడం కాంట్రాక్టర్లు ఓవర్లోడ్ తీసుకువస్తున్న లారీ ఓనర్లకు సమాచారం ఇవ్వడం లాంటివి చేస్తున్నారని అన్నాడు. పూర్తిగా అక్రమాలకు పాల్పడుతున్న భూపాలపల్లి జిల్లా పివో ను తొలగించి కొత్త వారిని నియమించాలని డిమాండ్ చేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక ర్యాంప్ లలో కుందునూరు ఇసుక ర్యాంప్ లో లోడింగ్ కి 1600 రూపాయలు కాంట పేరుతో 500 రూపాయలు, జేసీబీ ఆపరేటర్ పేరుతో 200 రూపాయలు మొత్తం కలిపి 2300 రూపాయలు వసూలు చేస్తున్నారని, విజయనగరం ఇసుక ర్యాంప్ లో సీరియల్ పేరుతో 200 రూపాయలు, లోడింగ్ కి 1500 రూపాయలు, జేసీబీ ఆపరేటర్ కి 200 రూపాయలు, కాంటకి 500 రూపాయలు వసులు చేస్తున్నారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న పివో కి ఇట్టి సమాచారం చెప్పిన ఫోన్ బ్లాక్ లిస్టులో పెట్టుకొని కాంట్రాక్టర్ల కి సహకరిస్తున్నాడని, టిజి ఎండిసి స్టాక్ యార్డ్ ఇంచార్జిలు ( ఎస్ ఆర్ ఏ ) లు ఒక్కరు కూడా డ్రైవర్లు ఫోన్ చేసిన మాట్లాడేది లేదని, ఇసుక లారీ ఓనర్స్ ఫోన్ చేసిన మాట్లాడేది లేదని, అంత పివో కనుసన్నల్లోనే అక్రమంగా ఇసుక లారీల దగ్గర లోడింగ్ పేరుతో అందినకాడికి దోసుకుంటున్నారని అన్నాడు. జిల్లాల్లోని పివోలు, కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారని, అట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలని అక్రమ లోడింగ్ డబ్బులను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశాడు.



# ఎండలతో సింగరేణి కార్మికుల ఇబ్బందులు

- **షిఫ్ట్ సమయాలు తగ్గించాలి.. గుర్తింపు సంఘాలు విఫలమయ్యాయి: మొలుమూరి శ్రీనివాస్**

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, హీట్‌వేవ్ పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని షిఫ్ట్ సమయాలను వెంటనే సవరించాలని బీజేపీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం, ప్రాథమిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం బొగ్గుగని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు నిల్వలు, నల్లని ఉపరితలాల కారణంగా సాధారణ ఉష్ణోగ్రత కంటే 4 నుంచి 5 డిగ్రీలు అధికంగా ఉండి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం షిఫ్ట్ సమయాల్లో మార్పులు చేసేవారని, అయితే ఈ ఏడాది ఇప్పటివరకు అలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు విధులు నిర్వహించడం వల్ల వడదెబ్బ, డీహైడ్రేషన్, తీవ్ర అలసట వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు.



కార్మికుల ప్రాణాల కంటే ఉత్పత్తికే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని పేర్కొన్న ఆయన, మొదటి షిఫ్ట్‌ను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరిమితం చేయాలని, రెండో షిఫ్ట్‌ను సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభించేలా సవరించాలని సూచించారు. జనరల్ షిఫ్ట్ ఉద్యోగులకు మధ్యాహ్న వేళల్లో బహిరంగ పనులు తగ్గించడంతో పాటు ప్రతి పని ప్రదేశంలో చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

దేశ విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి కార్మికుల ఆరోగ్యం, భద్రతకు యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రత్యేక చర్యలు తీసుకుని షిఫ్ట్ సమయాలను సవరించాలని, లేదంటే కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఉద్యమ కార్యాచరణ చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# కాలువల పూడిక తొలగింపుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

**పెద్దపల్లి బ్యూరో, మే 30 (డిడి9 వార్త):**

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువల్లో పేరుకుపోయిన పూడికను యుద్ధ ప్రాతిపదికన తొలగించి వరద ముప్పును నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. శనివారం వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా ఒకటవ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి ఆయన పర్యటించారు.

స్థానిక నాయకుడు మడిపెల్లి మల్లేష్ కాలనీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, మేయర్ ఆదేశాల మేరకు జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్, చైన్ జేసీబీ, బాబ్‌క్యాట్, జెట్టింగ్ యంత్రాలు, పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో పీకే రామయ్య కాలనీ, పట్టణ ప్రకృతి వనం పరిసరాల్లో



కాలువల శుభ్రత పనులు చేపట్టారు. పూడికతో నిండిపోయిన కాలువలను పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు, రహదారులపైకి విస్తరించిన తుప్పలు, పొదలు, చెట్ల కొమ్మలను తొలగించి మార్గాలను విశాలంగా తీర్చిదిద్దారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..., కాలనీ ఏర్పడినప్పటి నుంచి కాలువల్లో పూడిక తొలగించిన ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అవసరమైతే మరి కొన్ని రోజులు ప్రత్యేక డ్రైవ్ కొనసాగించి పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తామని తెలిపారు. గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న పీకే రామయ్య కాలనీలో రహదారులు, యూజీడీ పనులు చేపట్టామని, మిగిలిన పనులను డీఎంఎఫ్‌టీ, ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేస్తామని వెల్లడించారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిషనర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ..., రాష్ట్ర ప్రభుత్వ ఋతుపవన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వర్షాకాలానికి ముందే కాలువల శుభ్రత పనులు ప్రారంభించామని తెలిపారు. వరద ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి పూడిక తొలగింపు పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంగళ బాపు, ఎస్ఈ గురువీర, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్, సీనియర్ అకౌంటెంట్ రాజ్‌కుమార్, నగరపాలక సంస్థ సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతో దర్గా బస్తీ దుర్భర స్థితి

- **డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు**
- **బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**
- **వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**రాజేంద్రనగర్,మే 30 డిడి 9 వార్త**

అధికారుల నిర్లక్ష్య వైఖరితో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దర్గా బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నెలల తరబడి డ్రైనేజీ సమస్యలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో బిఆర్ఎస్ నాయకులు బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దర్గా బస్తీలో నెలకొన్న సమస్యలను పరిశీలించేందుకు శనివారం బీఆర్ఎస్ పార్టీ నేతలు పర్యటించారు.ఈ సందర్భంగా స్థానికులు తమ గోడును నేతల ముందు వెల్లగక్కారు.డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పూర్తిగా నిండిపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ దుర్వాసన వెదజల్లుతోందని, దీనివల్ల చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి నెలకొందని వాపోయారు.సమస్య పరిష్కారానికి అవసరమైన క్లీనింగ్ మిషన్లు,మోటార్ వాహనాలు లేవని అధికారులు చేతులెత్తేయడం దారుణమని స్థానికులు మండిపడ్డారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ఘాటుగా స్పందిస్తూ,ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించారు.వెంటనే దర్గా బస్తీలో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచి,శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇకపై కూడా సమస్యలను పట్టించుకోకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.





# కల్లాల్లో ధాన్యం...
# రైతుల కళ్లల్లో దైన్యం

- లారీలు రాక రైతుల ఆవేదన
- తాడ్వాయి మండలంలో ధాన్యం బస్తాల గుట్టలు
- ఎండకు ఎండుతూ... వర్షా నికి తడుస్తున్న ధాన్యం
- రాత్రింబవళ్లు కల్లాల వద్ద కాపలా కాస్తున్న రైతులు
- "కడుపుకు తిండి లేదు... కంటికి నిద్ర లేదు"
- తాడ్వాయి, కాటాపురం, గంగారం కేంద్రాల్లో భారీ నిల్వలు
- వేలాది బస్తాలు మార్కెట్‌కు వెళ్లక నిలిచిపోయిన పరిస్థితి
- జిల్లా అధికారులు లారీలు పంపడంలో విఫలం అంటూ విమర్శలు
- ఏటూరునాగారం పరిధిలో రైతుల తీవ్ర ఇబ్బందులు
- రోజుకు ఒకటి, రెండు లారీలు మాత్రమే వస్తున్నాయంటున్న రైతులు
- లారీ కోసం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు డిమాండ్?
- డబ్బులు ఇస్తేనే ధాన్యం తరలిస్తున్నారన్న ఆరోపణలు

**ఏటూరునాగారం క్రైమ్,మే 30,(డీడీ9 వార్త):** రైతులు రక్తం చెమటోడ్చి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే నెలల తరబడి నిల్వ ఉండిపోతోంది. మార్కెట్‌కు తరలించాల్సిన బస్తాలు లారీలు లేక కేంద్రాల్లోనే పేరుకుపోయాయి. లారీల కోసం రైతులు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

"కడుపుకు తిండి లేదు... కంటికి నిద్ర లేదు" అంటూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కల్లాల్లో ధాన్యం బస్తాలు కనిపిస్తుంటే, రైతుల కళ్లల్లో మాత్రం దైన్యం నెలకొంది.

తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, కాటాపురం, గంగారం, బీరెల్లి, నర్సాపురం, మేడారం, బయ్యక్కపేట తదితర కొనుగోలు కేంద్రాల్లో వేలాది బస్తాలు బర్కాలు కప్పి నిల్వ ఉన్నాయి. ఎండ తీవ్రతతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుండగా, ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని బస్తాలు తడిసిపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

లారీలు సరైన సమయంలో అందుబాటులో లేకపోవడంపై జిల్లా అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటూరునాగారం, చిన్నబోయినపెల్లి, రోయూర్, ముల్లకట్ట, మంగపేట, పస్రా, గోవిందరావుపేట, చల్వాయి, ఇంచర్ల ప్రాంతాల రైతులు కూడా ఇదే సమస్యతో సతమతమవుతున్నారు.

ఒక పోలీస్ అధికారి స్వచ్ఛందంగా రైతులకు సహాయం చేస్తూ కొద్దికొద్దిగా లారీలు పంపిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ రోజుకు ఒకటి లేదా రెండు లారీలు మాత్రమే రావడంతో సమస్యకు పూర్తి పరిష్కారం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే... లారీ డ్రైవర్లు లేదా మధ్యవర్తులకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు రహస్యంగా డబ్బులు ఇస్తేనే ధాన్యం బస్తాలు తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. "ఇదెక్కడి న్యాయం?" అంటూ ప్రశ్నిస్తున్నారు.

మండల, జిల్లా స్థాయి అధికారులు ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. వెంటనే అదనపు లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు.









## ఆదివాసి జాతి ములాలు ఇంటి ఇలవేల్పులు వాటినీ కాపాడుతు..

**అశ్వరావుపేట:మే 30 ( డిడి 9 వార్త)**

అశ్వరావుపేట (నియోజకవర్గం )దమ్మపేట మండలం కొమ్ముగుడెం గ్రామం లో అంకంపాలెం గ్రామానికి చెంధిన కాకా వారి యిలవేల్పులు కొమ్ముగుడెం గ్రామానికి విచ్చేసిన సంధర్భంగా ఆదివాసి పోరాట హక్కులు సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర నాయకులు తో కలిసి దర్శించుకోని, ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్నా జిల్లా ఆదివాసి నాయకులు సోయం వీరభద్రం దమ్మపేట (మండలం) (లింగాలపల్లి) గ్రామానికి చెంధిన బి.ఆర్.ఎస్ పార్టీ యువజన నాయకులు గుండి లాలు కొన్ని రోజులు క్రీతం ప్రమాధశస్తు రోడ్డు ప్రమాదం గురి అయి ఖమ్మం పట్టణం లో ఓ ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రి యలమద్ది ఆసుపత్రిలో చికిత్స పోంధుతుండ గా వారిని పరామర్శించి ,లాలు ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోని మనోధైర్యం నింపిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భా.ర.స నాయకులు సోయం వీరభద్రం ఈ కార్యక్రమం లో ఆదివాసి పోరాట హక్కుల సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ ,దారబోయిన రమేష్, డాక్టర్. సాగబోయిన పాపారావు,సోయం రాజబాబు,ఎర్రయ్య ,సత్యనారాయణ నరసింహారావు,వూకే బుల్లిబాబు ,నరసింహారావు,బుద్దుల శ్రీను, వాడే వినోద్,కాకా రామచంద్రం,కుంజా. సూర్యనారాయణ తధితరులు నాయకులు పాల్గొన్నారు

## రైతుల భూముల్లో డంపింగ్ యార్డ్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ వ్యతిరేకం

**జనగామ మే 30(డిడి 9 వార్త ) బ్యూరో**



భూగర్భ జలాలు, వ్యవసాయానికి ముప్పు: కొర్ర రాజేందర్ నాయక్

సిద్దాపూర్ ప్రాంతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా ఇంచార్జ్ కొర్ర రాజేందర్ నాయక్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. డంపింగ్ యార్డ్ వల్ల భూగర్భ జలాలు కలుషితమై వ్యవసాయం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన బంజారా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమానికి ఎల్‌హెచ్‌పీఎస్ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు, యువత, మహిళలు ఏకమై ఈ ప్రతిపాదనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.



## రెండు లారీలు ఢీ

**చర్ల, మే 30 (డిడి 9 వార్త)**

చర్ల మండలంలోని కొయ్యూరు గ్రామ శివారుల్లో గల పల్లె ప్రకృతి వనానికి అతి సమీపంలో శనివారం ఉదయం రెండు లారీలు ఒకదానికొకటి ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఇసుక ర్యాంపు నుండి ఇసుక లోడు చేసుకున్న ఇసుక లారీ బయలుదేరిన పది నిమిషాలలోనే ప్రమాదానికి గురయ్యిందని సమాచారం. ఈ ప్రమాదంలో లోడు లారీ ముందు భాగం నుజ్జయింది. మరొక లారీ ముందు అద్దం పలిగిపోయింది. వివరాల్లోకి వెళితే ఒక ఇసుక లోడు లారీ మరొక ఖాళీ లారీ ఢీకొన్న నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులకు గుర్రం జానయ్య (42) కె.బాలాజీ(40)లకు స్వల్పంగా గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన విషయం గమనించిన స్థానికులు వెంటనే గాయపడిన వారిని అంబులెన్స్ లో చర్ల లోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్ సీ)కి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది ఆ ఇద్దరికీ డ్రస్సింగ్ చేసి ప్రధమ చికిత్స అందించారు. ఈ ప్రమాదం సంభవించడానికి కారణం లారీ డ్రైవర్లు ఇద్దరు మద్యం మత్తులో ఉన్నట్లుగా స్థానికులు చెప్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.